
తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
మెదక్ - మహబూబ్‌నగర్
సంగారెడ్డి | సిద్దిపేట
జోగులాంబ గద్వాల
వనపర్తి | నారాయణపేట
నాగర్ కర్నూల్
గురువారం
16 అక్టోబర్ 2025
పేజీలు : 10



# డిసిసిపై



## నియమాకాలు.. సమావేశాలు..



- కార్యకర్తల అభీష్టం మేరకే డీసీసీ అధ్యక్షుడిఎంపిక..
- నీలం మధు ముదిరాజ్..
- కాట శ్రీనివాస్ గౌడ్ అధ్వర్యంలో డిసిసి అధ్యక్షుడు
- ఎంపికపై అభిప్రాయ సేకరణ

**పటాన్చెరువు అక్టోబర్ 15 (జనం సాక్షి)**
కాంగ్రెస్ పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసేందుకు డీసీసీ అధ్యక్షుల నియామక ప్రక్రియ కొన సాగుతోంది. సంఘటన్ సృజన్ అభియాన్ కార్యక్రమం పేరుతో ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తూ అభిప్రాయాలు సేకరిస్తున్నారు. డీసీసీ పదవికి పోటీలో ఉండే ఆశావాహుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. జిల్లా, మండల స్థాయిలోని కాంగ్రెస్ నేతలో సమావేశమై అభిప్రాయాలు సేకరిస్తున్నారు. కాని.. మరోవైపు డీసీసీ ఎంపికపై నిర్ణయం పూర్తయిందంటూ మహబూబ్‌నగర్ జిల్లాలో జోరుగా ప్రచారం సాగుతోంది. మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త మన్నే జీవన్ రెడ్డికి డీసీసీ పదవి వరిస్తుందని భావిస్తున్నారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా పోటి చేసి ఓడినా అందరితో కలివిడిగా ఉంటు ఎలాంటి రాజకీయ కాంట్రావర్సీలకు ..మిగతా 2లో

### కొనుగోలుకు
## విస్తృత ఏర్పాట్లు

**ధాన్యం కొనుగోళ్లపై వీడియో కాన్ఫరెన్స్ - జిల్లా కలెక్టర్ పి ప్రావీణ్య**

సంగారెడ్డి ప్రతినిధి, అక్టోబర్ 15( జనం సాక్షి) : ఖరీఫ్ 2025-26 - వానాకాలం లో రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించే ప్రక్రియ సజావుగా కొనసాగేలా విస్తృత స్థాయిలో ఏర్పాట్లు చేయాలని అధికారులకు జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య ఆదేశించారు. ఖరీఫ్ 2025-26 - ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ఏర్పాట్లలో ఎక్కడ కూడా రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా




ముందస్తు ప్రణాళికతో అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని ఆయా జిల్లాల కలెక్టర్లు కు సూచించారు . ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణ రావు, ఇతర ఉన్నతాధికారులతో కలిసి మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర్ రావు, బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయా జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ..మిగతా 2లో

### చేయుత
## అవగాహన కలిగి ఉండాలి




మెదక్ జిల్లా బ్యూరో, అక్టోబర్ 15( జనం సాక్షి): చేయూత పథకం ద్వారా అందే సామాజిక పింఛన్ల పై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులకు సూచించారు. బుధవారం సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఎంపీడీవోలు ఎంసీఎస్‌లు, పంచాయతీ కార్యదర్శులు, బిల్ కలెక్టర్లు, పోస్టల్ అధికారులు, సెక్షన్ అసిస్టెంట్ అధికారులతో ..మిగతా 2లో

## అయిజ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ

**గద్వాల నడిగడ్డ,అక్టోబర్ 15 (జనం సాక్షి)**
వార్షిక తనిఖీలలో భాగంగా జిల్లా ఎస్పీ బుధవారము అయిజ పోలీసు స్టేషన్‌ను సందర్శించి సిబ్బంది



యూనిఫామ్ టర్న్ ఔట్, స్టేషన్ రికార్డ్స్, పరిసరాలను తనిఖీ చేశారు.ఈ సందర్భంగా అయిజ పోలీసు గౌరవ వందనం స్వీకరించిన అనంతరం స్టేషన్ పరిసరాల శుభ్రత, సిబ్బంది బ్యారక్స్, స్టేషన్ రికార్డుల మెంటేనేన్స్ ను పరిశీలించారు. సిబ్బంది కిట్ ఆర్టికల్స్ తనిఖీ చేస్తూ.. కిట్ ఆర్టికల్స్ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో ఉన్న స్వాధీనం చేసుకున్న కేసులో ఉన్న వాహనాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. స్టేషన్ రికార్డు లను తనఖీ చేస్తూ ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తును చేయాలని, ఆస్థి సంబంధిత నేరాలకు సంబంధించి, అధిక నేరాలు జరుగుతున్న ప్రాంతాలను బ్లాక్ స్పార్ట్స్ లు గా ..మిగతా 2లో

### పదో తరగతి ఫలితాల్లో
## వంద శాతం ఉత్తీర్ణత

**పదో తరగతి ఫలితాల్లో జిల్లాలో వంద శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించాలి**
**విద్యార్థులు గణితంపై శ్రద్ధ వహించి బాగా చదివి మంచి మార్కులు సాధించాలి**
**డిఎస్పీ ఉద్యోగం సాధించిన గోర్ల సుమశ్రీ ని అభినంధించిన కలెక్టర్ ఆదర్శ్ సురభి**

వనపర్తి బ్యూరో అక్టోబర్15 జనంసాక్షి : రాబోయే పదో తరగతి బోర్డు పరీక్షల్లో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు వంద శాతం పాస్ అయ్యే విధంగా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు.బుధవారం జిల్లా కేంద్రంలోని హరిజనవాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్బంగా కలెక్టర్ ఉపాధ్యాయులతో ప్రత్యేక సమావేశమై పదో తరగతి చదువుతున్న విద్యార్థుల ప్రోగ్రెస్ రిపోర్టులను, అటెండెన్స్ పరిశీలించారు. ఈ సందర్బంగా కలెక్టర్ విద్యార్థులకు మంచి మార్కులు సాధించడం కోసం




..మిగతా 2లో

# కొనుగోలుకు విస్తృత ఏర్పాట్లు

(మొదటి పేజీ తరువాయి)

సంబంధిత అధికారులతో ధాన్యం సేకరణ ప్రక్రియపై సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రాల నిర్వహణ సజావుగా జరగాలని మంత్రులు ఉత్తమ్ కుమార్, తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. సంగారెడ్డి జిల్లా నుండి కలెక్టర్ పి. ప్రావీణ్య , అదనపు కలెక్టర్ (రెవిన్యూ ) మాధురి , జిల్లా పౌరసరఫరాల శాఖ ,వ్యవసాయశాఖ, సహకారశాఖ ,గ్రామీణాభివృద్ధి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ అధికారులతో సమీక్ష జరిపారు. ధాన్యం సేకరణ ప్రక్రియ సజావుగా కొనసాగేలా విస్తృత ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు . ప్రతి కేంద్రంలో మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా చూడాలని ఆదేశించారు. ముందుగా హార్వెస్టర్ ఆపరేటర్లతో సమావేశం ఏర్పాటు చేయాలని సూచించారు. కొనుగోలు కేంద్రాలు లోతట్టు ప్రాంతాల్లో ఏర్పాటు చేయరాదని, ప్రతి మండలం, నియోజకవర్గానికి ప్రత్యేక అధికారులు, సూపర్వైజర్లు నియమించాలని సూచించారు. హమాలీల కొరత లేకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని, వాతావరణ శాఖ రిపోర్టులను కేంద్ర నిర్వాహకులకు తెలియజేయాలని అన్నారు . జిల్లాలో వరి కొనుగోలు కంట్రోల్ రూమ్ , టాస్క్ ఫోర్స్ టీంలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఇతర జిల్లాల నుండి ధాన్యం రాకుండా ఇంటర్ చెక్‌పోస్టులు ఏర్పాటు చేయాలని సూచించారు. ఓపీఎంఎస్ వ్యవస్థలో మిల్లుల ట్యాగింగ్ పనులు పూర్తి చేయాలని, పిపిసి సెంటర్ల నుండి నిర్ధారిత రైస్ మిల్లులకు మాత్రమే ధాన్యం పంపించాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాలలో తాగునీటి వసతులతో పాటు విద్యుత్ సౌకర్యం రైతుల విశ్రాంతి కోసం షెడ్ల ఏర్పాటు చేయాలని సిబ్బందికి సూచించారు. కొనుగోలు కేంద్రాలకు దాన్యం తీసుకువచ్చే రైతులు సరియైన తేమ శాతం ఉండేలా చూడడంతో పాటు ధాన్యం తూర్పార బట్టి కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. తార్పాలిన్లు, ఆటోమేటిక్ వరి శుభ్రపరచే యంత్రాలు, పెద్ద/చిన్న వరి క్లీనర్లు, ధాన్య కొలమాన పరికరాలు (గ్రేయిన్ కాలిపర్స్), తేమ కొలిచే మీటర్లు (మొయిసచర్ మీటర్స్), ఎలక్ట్రానిక్ తూకం యంత్రాలు, పొట్టు తొలగించే యంత్రాలు (హస్క్ రిమోవర్స్), ఫీల్డ్ తూకం యంత్రాలు (ఫీల్డ్ బాలన్స్), మొబైల్ ఎండబెట్టే యంత్రాలు (మొబైల్ డ్రైయర్స్) వంటి మౌలిక వసతులు కేంద్రాలలో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులును ఆదేశించారు. ఈ సమావేశంలో డి.ఎం సివిల్ సప్లై అధికారి అంబదాస్ రాజేశ్వర్, జిల్లా పౌరసరఫరాల అధికారి బాల సరోజ, జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్, జిల్లా సహకార శాఖ అధికారి కిరణ్ కుమార్, పి.డి డిఆర్డిఏ జ్యోతి, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు దీపిక,ప్రతిభ, తూనికలు కొలతల శాఖ అధికారులు,పోలీస్ శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# చేయుతపై అవగాహన కల్గి ఉండాలి

(మొదటి పేజీ తరువాయి)

సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ చేయూత పథకం ద్వారా అందే సామాజిక పింఛన్లు వృద్ధాప్య, వితంతు, వ్యాధిగ్రస్తుల, సామాజిక ఆర్థికంగా ,వెనుకబడిన వారికి ఇచ్చే పింఛన్ల పై గ్రామ, మండల, జిల్లా స్థాయిలో ఉన్న అధికారులందరి కీ అవగాహన కలిగి ఉండాలన్నారు. వివిధ పింఛన్ల గల అర్హతలు ఏమిటి, పింఛన్లకు గల నిబంధనలు ఏమిటి అనేది కచ్చితంగా తెలుసుకోవాలన్నారు. ప్రతి సోమవారం రోజున ప్రజావాణి కార్యక్రమానికి అనేకమంది వివిధ రకాల పింఛన్ల కోసం కలెక్టర్ కార్యాలయం రావడం తరచూ మేము చూస్తున్నామని, వారిని గ్రామాల్లో ,మండల స్థాయిల్లో అవగాహన కల్పించి ,అర్హత గల వారిని అందరికి పింఛను వచ్చేలా కృషి చేయాలని అధికారులకు తెలిపారు. వివిధ పింఛన్లకు గల అర్హతలను వాటి విధివిధానాలను పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా అధికారులకు వివరించారు. అవగాహన కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్,జెడ్పి సీఈఓ ఎల్లయ్య, సెర్ప్ డైరెక్టర్ (పింఛన్లు) గోపాల్ రావు,డిఆర్డిఓ శ్రీనివాసరావు, జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య, ఎంపీడీవోలు, ఎంసీఎస్ లు, పంచాయతీ కార్యదర్శులు ,బిల్ కలెక్టర్లు, పోస్టల్ అధికారులు, సెక్షన్ అసిస్టెంట్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మిల్లర్లు బాకీ పడ్డ సీఎంఆర్ ఇవ్వాల్సిందే

వనపర్తి బ్యూరో : గత ఖరీఫ్ సీజన్ లో వరి ధాన్యం పొందిన వారిలో వంద శాతం సీఎంఆర్ సమర్పించిన వారికే ఖరీఫ్ 2025-26 సీజన్ ధాన్యం కేటాయించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. బుధవారం కలెక్టరేట్ లోని ఎన్ ఐ సీ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ అదనపు కలెక్టర్ రెవెన్యూ ఖీమ్యా నాయక్ తో కలిసి రైస్ మిల్లర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గత ఖరీఫ్ 2024-25 సీజన్ లో వరి ధాన్యం పొందిన వారిలో వంద శాతం సీఎంఆర్ సమర్పించిన వారికే ఖరీఫ్ 2025-26 సీజన్ ధాన్యం కేటాయించడం జరుగుతుందని స్పష్టం చేశారు. నవంబర్ 12వ తేదీ లోపు పెండింగ్ సీఎంఆర్ పూర్తి చేసి కొత్త ధాన్యం పొందడానికి సహకరించాలని సూచించారు. సీఎంఆర్ పూర్తి చేసి బ్యాంకు గ్యారంటీ లు కూడా వేగంగా సమర్పించాలని సూచించారు. ఈ ప్రక్రియ సజావుగా సాగితేనే ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కేటాయించడానికి అవకాశం ఉంటుందని స్పష్టం చేశారు.సమావేశంలో పౌర సరఫరాల అధికారి కాశీ విశ్వనాథ్, డి ఎం జగన్, రైస్ మిల్లర్లు, తదితరులు పాల్గొన్నారు.

# డీసీసీ...

(మొదటి పేజీ తరువాయి)

తావయివ్వక పోవడం ఆయనకు కలిసి వస్తోంది. మహబూబ్‌నగర్ జిల్లా రాజకీయాలలో పూర్తి స్థాయిలో దృష్టి సారించుకునేందుకు కసరత్తును ప్రారంభించినట్లు కాంగ్రెస్ వర్గాల్లో తీవ్ర చర్చ నడుస్తోంది. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో స్వంత ఇంటి నిర్మాణపనులను సైతం ప్రారంభించారు. ఏది ఎమైన.. ఎవరు ఎన్నికైన పార్టీ ప్రతిష్టత, స్థానిక సంస్థలు, కార్పొరేషన్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేసే వారికే డీసీసీ అధ్యక్ష పదవి కట్టబెట్టాలని కాంగ్రెస్ పార్టీ శ్రేణులు కోరుతున్నాయి..

**కార్యకర్తల అభీష్టం మేరకే డీసీసీ అధ్యక్షుడి ఎంపిక.. : నీలం మధు ముదిరాజ్..**

కార్యకర్తలు, మండల, బ్లాక్ స్థాయి అధ్యక్షుల అభీష్టం మేరకే సంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష నియామకం జరుగుతుందని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ కంటెస్టెడ్ క్యాండిడేట్ నీలం మధు ముదిరాజ్ అన్నారు. బుధవారం అశోక్ నగర్ లోని సితార గ్రాండ్ హెూటల్ లో ఏఐసీసీ అబ్జర్వర్ సజరిట లైత్ ప్లాంగ్, పీసీసీ పరిశీలకులు జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంత్ రావు ఆధ్వర్యంలో పటాన్ చెరు నియోజకవర్గ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సంఘటన్ సృజన్ అభియాన్ సమావేశంలో నీలం మధు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘటన్ సృజన్ అభియాన్ లో భాగంగా కార్యకర్తల అభిప్రాయాలు తీసుకుని జిల్లా అధ్యక్షులను ఎంపిక చేయడం శుభపరిణామన్నారు. ఈ ప్రక్రియ ద్వారా పార్టీ కోసం కష్టపడే నాయకుడిని జిల్లా అధ్యక్షుడిగా ఎన్నుకునే వెసలుబాటు కలుగుతుందన్నారు. సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజక వర్గాల్లో బ్లాక్, మండల, గ్రామ స్థాయి నాయకుల అభిప్రాయాలు తీసుకుని ఎంపిక చేసే అధ్యక్షుడికి మనమంతా సంపూర్ణంగా సహకరించాల్సిన అవసరం ఉందన్నారు. కాంగ్రెస్ అధిష్టానం సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా ఎవరిని నియమించిన మనమంతా కలిసి పనిచేసి పార్టీ అభివృద్ధి కోసం కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్యక్షులు ముజాహిద్ ఆలం ఖాన్, గాలి అనిల్ కుమార్, నియోజకవర్గ ఇన్చార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్, శశికళ యాదవరెడ్డి, ఐ ఎన్ టి యు సి జిల్లా అధ్యక్షులు నరసింహ రెడ్డి, బ్లాక్, మండల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

**కాట శ్రీనివాస్ గౌడ్ అధ్యర్యంలో డిసిసి అధ్యక్షుడు ఎంపికపై అభిప్రాయ సేకరణ**

కాట శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో బుధవారం నాడు నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుని ఎంపిక కార్యక్రమం అశోక్ నగర్ లోని సితార గ్రాండ్ హెూటల్ లో నిర్వహించబడింది. సంఘటన్ సృజన్ అభియాన్ సమావేశంలో కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుని డీసీసీ ఎంపిక ప్రక్రియ వేగం పుంజుకుంది. ఏఐసీసీ ఆదేశాల మేరకు, పీసీసీ సూచనల ప్రకారం అభిప్రాయ సేకరణ సమావేశాలు నిర్వహించారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ... జిల్లాలో అందరికీ ఆమోదయోగ్యమైన నాయకత్వాన్ని ఏర్పాటు చేయాలనే ఉద్దేశంతో ఈ సమావేశాలు చురుగ్గా సాగాయి. ఈ కార్యక్రమాల్లో ఏఐసీసీ సెక్రటరీ సంగారెడ్డి జిల్లా అబ్జర్వర్ జరిత,జుక్కల్ శాసనసభ్యులు లక్ష్మీకాంతారావు నాయకులతో సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా పటాన్చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ అభిప్రాయ సేకరణ డీసీసీ అధ్యక్షుని ఎంపికలో అందరికీ ఆమోదయోగ్యమైన, పార్టీ పట్ల నిబద్ధత కలిగిన, క్రమశిక్షణతో ఉన్న నాయకుడినే ఎంపిక చేస్తామని తెలిపారు.పార్టీ ఐక్యతను కాపాడుతూ, త్యాగం చేసిన, ప్రజలతో మమేకమైన నాయకత్వం అవసరమని స్పష్టం చేశారు. జిల్లా స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు కాంగ్రెస్ శక్తిని పునరుద్ధరించేందుకు సమన్వయంగా పని చేయాలని అబ్జర్వర్లు సూచించారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు,మండల కాంగ్రెస్ అధ్యక్షులు,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, ప్రతినిధులు పాల్గొన్నారు.



# అయిజ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ

(మొదటి పేజీ తరువాయి)

గుర్తించి, పగలు, రాత్రి బీట్ డ్యూటీల ద్వారా నిఘా కట్టుదిట్టం చేయాలని సూచించారు. కర్ణాటక, ఆంధ్ర సరిహద్దు పోలీస్ స్టేషన్ గా ఉన్నందున ఎలాంటి ఇల్లీగల్ రవాణా జరుగకుండా చెక్ పోస్ట్ ల దగ్గర పటిష్ట నిఘా ఉండాలని ఎస్సై శ్రీనివాస్ కు సూచించారు. రిసీప్షన్ సిబ్బంది స్టేషన్ కు వచ్చిన ప్రతి దరఖాస్తును ఆన్లైన్ లో నమోదు చేయాలని, ఫిర్యాదిదారులతో మర్యాదగా మాట్లాడాలని అన్నారు.వి పి ఓ లు గ్రామాలపై పూర్తి అవగాహనా ఉండాలని, రౌడీ షిటర్స్, సస్పెక్ట్ ల పై నిఘా ఉంచాలని, గ్రామాలలో తిరుగుతూ ప్రజలతో మమేకం అవ్వాలని, తద్వారా గ్రామాలలో ఎలాంటి సమాచారం కావాల్లన్న ముందస్తుగా తెలుసుకునేందుకు అవకాశం ఉంటుందని అన్నారు. గ్రామాలలో అనుమానిత వ్యక్తులను పాపిలోన్ డివైస్ ను వినియోగించి, వేలిముద్రాలను చెక్ చేస్తూ,పాత నేరస్తులను గుర్తించాలని అన్నారు. నేరాల అదుపులో, జరిగిన నేరాలను ఛేదించడంలో ఉపయోగపడే సిసి కెమెరాల ప్రాధాన్యతను ప్రజలకు వివరిస్తూ ప్రజలే స్వచ్ఛందంగా సిసి కెమెరాలను ఏర్పాటు చేసుకునే విధంగా అవగాహన కల్పించాలని అన్నారు. స్టేషన్ రికార్డులైన పార్ట్ 1 - 5 పెండింగ్ లేకుండా చూడాలని, సిబ్బందికి వర్టికల్ వారీగా విధులను కేటాయించాలని ఎస్.హెచ్.ఓ కు సూచించడం జరిగింది. రోడ్డు ప్రమాదాల నివారణకు, సైబర్ నేరాల నివారణకు వివిధ స్కూల్స్ కళాశాలలు, పని ప్రదేశాలలో కమ్యూనిటీ పోలిసింగ్ ద్వారా అవగాహన కల్పించాలని అన్నారు. విజిబుల్ పోలీసింగ్ లో భాగంగా ప్రతి రోజు వాహానాల తనిఖీ నిర్వహిస్తూ, ట్రాఫిక్ నియమాలు పాటించని వాహణదారులపై చర్యలు తీసుకోవాలని, అనుమానిత వాహానాలను అదుపులోకి తీసుకోవాలని అన్నారు. బ్లూ కోల్ట్స్ సిబ్బంది ప్రతి పాయింట్ ను తనిఖీ చేయాలని, డైల్ -100 కాల్స్ కు త్వరితగతిన స్పందించాలని సూచించారు.మారుతున్న సమాజానికి అనుగుణంగా తెలంగాణ రాష్ట్ర పోలీసుశాఖ అందుబాటులోకి తీసుకువచ్చిన సీసీటీఎన్ఎస్ - 2.0, పిటిషన్ మేనేజ్‌మెంట్ సిస్టమ్, టీఎస్-కాప్, హెచ్ఆర్ఎంఎస్, ఈ-సాక్ష్య, టెక్ డాటం, ఐరాడ్ దర్పణ్, సీఈఐఆర్, సైబర్ క్రైమ్ నేరాల నియంత్రణ, సీడీఆర్, సిఇఐఆర్ పోర్టల్, పోర్టబుల్ ఫింగర్ ప్రింట్ డివైస్, బాడీ ఓన్ కెమెరాల వంటి సాఫ్ట్‌వేర్ అప్లికేషన్లు నేరాల అదుపునకు, జరిగిన నేరాలను ఛేదించడానికి ఉపయోగకరంగా ఉన్నాయని, అన్ని అప్లికేషన్లపై పూర్తి స్థాయిలో పట్టు సాధించి, నేరాల నియంత్రణలో కీలకంగా వ్యవహించాలని సిబ్బందికి సూచించడం జరిగింది, ఇప్పుడు నేర్చుకున్న పని మీ సర్వీస్ మొత్తం ఉపయోగపడుతుందన్నారు. అనంతరం సిబ్బందితో మాట్లాడుతూ విధి నిర్వాహణలో అంకిత భావంతో పని చేయాలని. ఎవరికీ కేటాయించిన విధులను వారు సక్రమంగా నిర్వర్తించినప్పుడే పోలీసు శాఖకు మంచి పేరు వస్తుందని అన్నారు. డ్యూటీ పరంగా లేదా వ్యకిగతంగా ఎలాంటి సమస్య ఉన్న నేరుగా నా దృష్టికి తీసుకురావొచ్చు అన్నారు. ఓకే చోట పని చేస్తున్నప్పుడు ఫ్రెండ్స్ లాగా కలిసి మెలసి ఉండాలని, పాజిటివ్ ఆలోచనలతో పని చెయ్యాలని అన్నారు. ప్రజలు పోలీస్ యూనిఫామ్ కు ఎంతో గౌరవం ఇస్తారో అంతే గౌరవం తో బాధ్యతగా విధులు నిర్వహించాలని అన్నారు. విధులను, పర్సనల్ లైఫ్ ను బాలన్స్ చేసుకొని ముందుకెళ్లాలని సూచించారు. ఈ తనిఖీ లలో ఎస్పీ వెంబడి అదనపు. ఎస్పీ కె. శంకర్, డి.ఎస్పీ మొగిలయ్య, శాంతినగర్ సీఐ టాటా బాబు,ఎస్సై శ్రీనివాసులు, తరుణ్ కుమార్ రెడ్డి ఉన్నారు.




# వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

(మొదటి పేజీ తరువాయి)

ప్రత్యేకంగా తయారు గణిత పాఠ్యంశాల పుస్తకాన్ని ఆవిష్కరణ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ రాబోయే పదో తరగతి బోర్డు పరీక్షల్లో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు వంద శాతం పాస్ అయ్యే విధంగా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గణితంలో వెనకబడిన విద్యార్థులు మేరుగయ్యే విధంగా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు.ప్రత్యేక తరగతులు నిర్వహించడంతో పాటుగా ముఖ్యమైన అంశాలపై దృష్టి సారించాలని సూచించారు. వారం వారం నిర్వహించే పరీక్షల్లో విద్యార్థుల మెరుగుదల కనిపించాలని, బోధన ఇంకా మెరుగ్గా చేయాలని ఆదేశించారు. పదో తరగతి పూర్తయిన తర్వాత విద్యార్థులు డ్రాప్ ఔట్స్ లేకుండా చూడాలని ఆదేశించారు.

# ఉన్నత స్థాయికి ఎదిగిన విద్యార్థులకు అభినందన

జిల్లా కేంద్రం లోని హరిజన వాడకు చెందిన పలువురు ఉన్నత స్థాయికి చేరిన విద్యార్థులను కలెక్టర్ అభినందించారు. గ్రూప్ 1 పరీక్ష లో డిఎస్పీ గా ఎంపికైన గోర్ల సుమశ్రీ, ఎం బీ బీ ఎస్ లో సీట్ సాధించిన ఎం దివ్య, నీట్ లో ఉత్తమ ర్యాంక్ సాధించిన జీ ఉదీప్ లను కలెక్టర్ శాలువాతో సన్మానించారు. ఉన్నంతంగా ఎదిగిన వారిని స్ఫూర్తి గా తీసుకుని విద్యార్థులు బాగా చదివి ఉన్నత శికరాలను అధిరోహించాలని సూచించారు. ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పిస్తోందని విద్యార్థులు బాగా చదవాలని సూచించారు. గతేడాది ఈ పాఠశాలలో చదివిన విద్యార్థులు వంద శాతం పాస్ అయ్యారని అదేవిధంగా ఈ సారి కూడా ఫలితాలు ఉండాలని చెప్పారు. అనంతరం జిల్లా కలెక్టర్ ను పాఠశాల తరపున శాలువా తో సన్మానించారు. డిఈఓ అబ్దుల్ ఘని, గంధం నాగరాజు, ప్రధానోపాధ్యాయులు, అధికారులు పాల్గొన్నారు.

# రూ:40లక్షలతో గ్రామ పంచాయితీ భవనాల నిర్మాణానికి శ్రీకారం

## పనులను ప్రారంభించిన ఎంపీడీఓ శ్రీనివాస్



**న్యాల్ కల్, అక్టోబర్ 15, (జనంసాక్షి) :** జిల్లా పంచాయతీ రాజ్ అధికారుల ఆదేశం మేరకు గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణానికి స్థానిక పంచాయతీ రాజ్ అధికారులు దృష్టి సారించారు. బుధవారం మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీఓ) గూడెం శ్రీనివాస్, స్థానిక గ్రామ పంచాయతీ అధికారులతో కలిసి పనులను ప్రారంభించారు. 2025 / 26 ఆర్థిక సంవత్సరానికి గాను జాతీయ ఉపాధి హామీ పథకం నిధులు రూ:20 లక్షలతో మండలంలోని హుమ్నాపూర్ గ్రామంలో నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులను ప్రారంభించారు. మండలంలోని తాటిపల్లి గ్రామంలో రూ:20 లక్షలతో నిర్మించ తలపెట్టిన గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని పరిశీలించారు. అనంతరం గ్రామంలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను పరిశీలించారు. నిబంధనల మేరకు ఇండ్ల నిర్మాణాలను చేపట్టిన ప్రతి లబ్ధిదారుడికి తప్పనిసరిగా సకాలంలో విడతల వారీగా నిధులను అర్హులైన లబ్ధిదారుల ఖాతాలో జమ చేయడం జరుగుతుందని, ఎలాంటి అపోహలకు గురికాకూడదని ఎంపీడీఓ స్పష్టం చేశారు. బిల్లుల చెల్లింపు విషయములో గ్రామ పంచాయతీ అధికారులు చేతివాటం ప్రదర్శిస్తే తమ దృష్టికి తీసుకురావాలని లబ్ధిదారులకు వివరించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులు, అధికార, విపక్ష పార్టీలకు చెందిన శ్రేణులు పాల్గొన్నారు.


# అబ్దుల్‌కలం సేవలు చిరస్మరణీయం



**కల్వోర్ అక్టోబర్ 15 (జనంసాక్షి):** మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం దేశానికి చేసిన సేవలు మరువలేనివని ఉపాధ్యాయులు భరత్, వంశీకృష్ణ అన్నారు. బుధవారం కల్వోర్ మండలంలోని మహాదేవ్ పల్లి ప్రాథమిక పాఠశాలలో మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశానికి అబ్దుల్ కలాం అందించిన సేవలను కొనియాడారు. నేటి యువతరం ఆయనను ఆదర్శంగా తీసుకొని దేశ అభివృద్ధికి పాటుపడాలని సూచించారు ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

# ఘనంగా అబ్దుల్ కలాం జయంతి వేడుకలు

**మహమ్మదాబాద్/గండీడ్, అక్టోబర్ 15 (జనంసాక్షి) :** రాష్ట్రపతి భారతరత్న అవార్డు గ్రహీత ఏపీజే అబ్దుల్ కలాం ఉమ్మడి మండల కేంద్రంలో బుధవారం ఘనంగా జరిగాయి.జయంతిని పురస్కరించుకొని,అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ శాంతిరంగ్య,బీసీ సంఘం అధ్యక్షుడు వేణుగౌడ్,వారు మాట్లాడుతూ,ఒక్కనిరుపేద కుటుంబంలో జన్మించిన అబ్దుల్ కలాం భారత అణురంగంలో అత్యున్నతస్థాయికి చేరి అనేక సేవలు అందించిన గొప్ప శాస్త్రవేత్త అని అన్నారు.ఆయన రాష్ట్రపతిగా దేశానికి అందించిన సేవలు మరువలేనివని అని అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శాంతి రంగ్య, బెస్తరాజు, వేణుగౌడ్, శంకర్ గుప్త అనంతయ్య,వివిధ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



# పశువులకు ఉచిత పశు వైద్య శిబిరం

**గద్వాల నడిగడ్డ,అక్టోబర్ 15 (జనంసాక్షి):** జోగులాంబ గద్వాల జిల్లా ఎర్రవల్లి మండలం యాక్టాపూర్ గ్రామంలో బుధవారము గాలికూంటూ వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా పశుసంవర్ధక అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్.యు.ఆర్. రమేష్ మాట్లాడుతూ గాలికుంటూ వ్యాధి వచ్చిన పశువులలో నోటిలో,గిట్టల మధ్యలో పుండ్లు కావటం చోంగ కారటం,పశువు మేత తినకపోవటం,జ్వరం ఉండటం వంటి లక్షణాలు కనిపిస్తాయని,ఈ వ్యాధి సోకిన పశువును మంద నుంచి వేరుచేసి చికిత్స అందంచాలని,ప్రతి రోజు నోటిని గిట్టలని పోటాష్యామ్ పర్మాంగానేట్ లోషన్ తో కడగాలని,వ్యాధి సోకిన పశువుకు జొన్న సంకటి,జావా,వంటివి త్రాగిచాలని ఆయన అన్నారు. పాడి పశువులలో ఈ వ్యాధి వలన పాలు తగ్గిపోవటం,చూడి పశువులు ఈసుకపోవటం అపుడప్పుడు మరణాలు కూడా సంభవిచటం జరుగుతుందని,గాలి కుంటూ వ్యాధి రాకుండా ముందు గానే టీకాలు వేయించుకోవాలని రైతులను కోరారు.ఈ కార్యక్రమంలో 35 తెల్లపశువులు, 42 గేదెలకు మొత్తం 77 పశువులకు గాలి కుంటూ వ్యాధి నివారణ టీకాలు వేయటం జరిగిందని,ఈ కార్యక్రమంలో ఏరియా పశువైద్య శాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్.యు.ఆర్. రమేష్ తోపాటు అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్.జి.వెంకట్ నారాయణ,అలంపూర్ మండల పశు వైద్య అధికారి డాక్టర్



శంకరయ్య, ఇటిక్యాల పశు వైద్యాధికారి డాక్టర్ వినయ్ కుమార్ , ధర్మావరం డాక్టర్ భువనేశ్వరి ,ఉండవెల్లి డాక్టర్ సతీష్ కుమార్, ధరూర్ డాక్టర్ వెంకట రాజు, మానోపాడు డాక్టర్ పుష్పలత , మల్దకల్ డాక్టర్ ఉషారాణి ,వెటర్నరీ అసిస్టెంట్లు కార్తీక్ ,గోపాలమిత్ర సూపర్వైజర్ జయసింహ,ఓఎస్ శీనివాసులు, గోపాలమిత్రలు దేవన, రాజేంద్ర,శ్రీరాములు భరత్ పశు వైద్య సిబ్బంది, పాడి రైతులు శంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పశువులకు సకాలంలో గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలి

## జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్



**నారాయణపేట జిల్లా బ్యూరో అక్టోబర్ 15(జనంసాక్షి):** నారాయణపేట జిల్లాలోని అన్ని గ్రామాలలో నిర్ణీత షెడ్యూలు ప్రకారం పశు వులకు సకాలంలో గాలికుం టు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ సూచించారు. జిల్లా కేంద్రంలోని బాహర్ పేటలో బుధవారం పశుసంవ ర్ధక శాఖ ఆధ్వర్యంలో ఏర్పా టు చేసిన గాలికుంటు వ్యాధి నివారణ టీకాల శిబిరాన్ని కలెక్టర్ సందర్శించారు. పశు వులకు వేసే టీకాల కార్యక్ర మాన్ని ఆమె పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడు తూ కేంద్రం ప్రభుత్వం ఇటీవ లే ధన్ ధాన్య కృషి యోజన పథకాన్ని ప్రారంభించిందని,ఆ పథకం కింద రాష్ట్రంలోనీ నాలుగు జిల్లాలు జనగా మా,నాగర్ కర్నూల్, గద్వాల తో పాటు నారాయణపేట జిల్లాను కూడా ఎంపిక చేసిం దని గుర్తు చేశారు. అయితే ఆ పథకంలో వ్యవసాయ అనుబంధ శాఖలతో పాటు పశు సంవర్ధక, డైరీ, ఫిషరీస్, 11 అనుబంధ శాఖలలోని పారా మీటర్స్ ల అభివృద్ధి చేయ డం జరుగుతుందని తెలిపా రు.అందులో భాగంగానే పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాల శిబి రాలు నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు.దాదాపు లక్ష టీకా ల డోసులు అందుబాటులో ఉన్నాయని, జిల్లాలోని అన్ని గ్రామాల్లో పశువులకు టీకా లు వేయించాలని కలెక్టర్ పశుసంవర్ధక శాఖ అధికా రులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ ఆర్ .సదాశివారెడ్డి, పశువైద్యాధికారి, అనిరుద్ చారి, పాల్గొన్నారు.

# ఘనంగా కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు గుద్దటి కిస్టాల్ జన్మదిన వేడుకలు



**వెల్దండ అక్టోబర్ 15 (జనం సాక్షి) :** వెల్దండ మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ మండల యువ నాయకుడు గుద్దేటి కిష్టాల్ జన్మది న వేడుకలు ఘనంగా నిర్వహించారు .కేక్ కటింగ్ చేసి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మోతిలాల్ నాయక్, వెల్దండ మాజీ సర్పంచ్ భూపతిరెడ్డి , మార్కెట్ కమిటీ చైర్మన్ మనీలా సంజీవ్ యాదవ్ లు కిష్టాల్ ను శాలువాతో ఘనంగా సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో డైరెక్టర్ మట్ట వెంకటయ్య గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కొయ్యల పుల్లయ్య, ఎండి రషీద్,రేవల్లి రాజు, మట్ట నాగరాజు,రమేష్,మట్ట భరత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుల పై ఆగ్రహం వ్యక్తం చేసిన కలెక్టర్



**భూత్పూర్ అక్టోబర్ 15 (జనంసాక్షి):** మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ను బుధవారం మహబూబ్ నగర్ జిల్లా కలెక్టర్ విజయేంద్ర బోయి ఆకస్మిక తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించి, భోజనం చేస్తున్న చిన్నారులను నాణ్యతను అడిగి తెలుసుకున్నారు.పాఠశాలలోని ఉపాధ్యాయులు విద్యార్థులతో కలిసి భోజనం చేయకపోవడం పట్ల కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజనాన్ని తప్పనిసరిగా విద్యార్థులతో కలసి భోజనం చేసి నాణ్యత ప్రమాణాలు పరిశీలించాలని కలెక్టర్ చెప్పారు.పాఠశాల ఆవరణ అపరిశుభ్రంగా ఉండడం పట్ల కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. పాఠశాల మైదానంలో ఎక్కడ పడితే అక్కడ వాహనాలు పార్కింగ్ చేయడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు.

భారీగా పెరగనున్న మద్యం దరఖాస్తులు

# వనపర్తి జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాసులు



**వనపర్తి బ్యూరో అక్టోబర్ 15 (జనంసాక్షి):** మద్యం దరఖాస్తులు చివరి మూడు రోజులలో ఊపందుకోనున్నాయని వనపర్తి జిల్లా ఎక్సైజ్ సూప రింటెండెంట్ బి. శ్రీనివాసులు అన్నారు. మొత్తం 36 దుకాణాలకు నోటిఫికేషన్ ఇవ్వగా ఇప్పటివరకు 57 దరఖాస్తులు వచ్చాయన్నారు. గతంలో మద్యం దుకాణాలకు మొత్తం దరఖాస్తులు 1341 రాగా చివరి మూడు రోజులు1171 దరఖాస్తులు వచ్చాయన్నారు అదేవిధం గా ఈసారి కూడా పెద్ద సంఖ్యలో దరఖాస్తులు వచ్చే అవకాశం ఉందన్నారు.

# జిల్లా ప్రధాన న్యాయమూర్తి ని కలిసిన ఎస్పీ



**నారాయణపేట జిల్లా బ్యూరో అక్టోబర్ 15(జనంసాక్షి):** నారాయణ పేట జిల్లా నూతన ఎస్పీగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ బుధవారం జిల్లా ప్రధాన న్యాయ మూర్తి బోయ శ్రీనివాసులు ను ఆయన కార్యాలయంలో పూల మొక్క అందించి మర్యాదపూర్వకంగా కలిసారు. జిల్లా జడ్జి నూతన ఎస్పీకి శుభాకాంక్ష లు తెలిపి, జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, న్యాయ–పోలీసు వ్యవ స్థల మధ్య సమన్వ యం, కేసులు త్వరితగతిన పరిష్కారం కావడంలో సమన్వయం, తదితర అంశాలపై ఇద్దరు అధికారులు చర్చించారు.

## ఫతేపూర్‌లో రెండు గోమాతలు చోరి



**కల్హేర్ అక్టోబర్ 15( జనంసాక్షి):** కల్హేర్ మండలంలో ఫతేపూర్ గ్రామం లో మంగళ వారం రాత్రి బంగ్లా ఇంటి హనుమ గొండ నివాసం వద్ద కట్టివేసిన రెండు గోమాతలను గుర్తు తెలియని దుండగులు చోరి చేశారు. సుమారు రూ.80,000. విలువచేసే గోమాతలను చోరి కావడంతో జీవ నోపాధి కోల్పోయానని బాధితుడు హనుమ గొండ ఆవేదన వ్యక్తం చేశారు.

### పశువులకు గాలికుంటు

## నివారణ టీకాలు వేయించాలి

### జిల్లా పశు వైద్యాధికారి వెంకటయ్య



**శివ్వంపేట అక్టోబర్ 15 (జనంసాక్షి):** పశువులకు గాలికుంటు వ్యాధులు వ్యాప్తించకుండా ఉచిత నివారణ టీకాలు వేయించాలని జిల్లా పశు వైద్యాధికారి డాక్టర్ వెంకటయ్య పేర్కొన్నారు. బుధవారం మండల పరిధి లోని గుండ్లపల్లి గ్రామం లో జాతీయ ఉచిత గాలికుంటూ టీకాల కార్యక్రమం మండల పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ వెంకటయ్య పశువులకు గాలికుంటు నివారణ టీకాలను వేసి ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఇదే కార్యక్రమం లో గర్భకోశ వ్యాధుల చికిత్స శిభిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశం లో జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి వెంకటయ్య మాట్లాడుతూ ఈ గాలి కుంటూ టీకాల కార్యక్రమం ఈనెల 15 నుంచి నవంబర్ 14 వరకు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. జిల్లా పశు సంక్షేమ అధికారి ప్రభాకర్ పాల్గొని పశువులలో కృత్రిమ గర్భధారణ వలన జరిగే మేలును రైతులకు వివరించారు. అంతకుముందు గ్రామంలో 178 గేదెలకు టీకాలు, 45 పశువులకు చూడి పరీక్షలు, 32 దూడలకు నట్టల నివారణ మందు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమం లో నర్సాపూర్ ఏడి జనార్దన్ రావు మండల పశు వైద్యాధికారి, డాక్టర్ సంధ్యరాణి, డాక్టర్లు ఫర్వీన్, కీర్తి, గోపాల మిత్ర గోపాల్, సూపర్వైజర్ సత్యనారాయణ, ఓఎస్ వెంకట్ లతోపాటు రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## రైతు ఉత్పత్తిదారుల సంఘం (ఎఫ్‌పిఓ) ద్వారా రైతులకు ఎంతో మేలు

**రేవల్లి, అక్టోబర్ 15 (జనంసాక్షి):** ఉత్పత్తి దారుల సంఘాల ద్వారా రైతులకు ఎంతో మేలు జరుగుతుందని సహకార శాఖ జాయింట్ రిజిస్టర్, ఎఫ్ పి ఓ ఉమ్మడి జిల్లా నోడల్ ఆఫీసర్ పరిమళ దేవి అన్నారు. బుధవారం వనపర్తి జిల్లాలో వనపర్తి, గోపాల్ పేట్, కొప్పునూర్, పానగల్, కొత్తకోట, ఆత్మకూరు, ఆరు ప్రాథమిక సహకార సంఘాలు రైతు ఉత్పత్తిదారుల సంఘాలుగా ఎంపిక చేయబడ్డాయి. ఎంపికైన రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు సమావేశం నిర్వహించి సీఈఓ లకు, రైతులకు, ఆయా సంఘాల డైరెక్టర్లకు, సింగిల్ విండో సిబ్బంది కి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతు ఉత్పత్తి దారుల సంఘాల ద్వారా రైతులు కల్తీ విత్తనాలను కాకుండా నాణ్యమైనటువంటి విత్తనాలను వెయ్యడం ద్వారా అధిక దిగుబడిని సాధించవచ్చు అన్నారు. వాణిజ్య పంటలకు జూన్ మాసం నుండి ఆగస్టు నెల వరకు అనుకూలంగా ఉంటుందన్నారు. వ్యవసాయ, హార్టికల్చర్ శాఖల ద్వారా రైతులకు సబ్సిడీ పైన వ్యవసాయానికి ఉపయోగపడే యంత్రాలను రైతులకు అందిస్తుందన్నారు. ఎఫ్‌పివో రైతులకు ఉచితంగా నారు అందించడం జరుగుతుందన్నారు. ఎఫ్ పి వో సంఘాలలో చైర్మన్లు, డైరెక్టర్లు, ఎలాంటి ఆదాయం లేకుండా రైతులకు ఉచిత సలహాలు, సూచనలను ఇవ్వడంతో కీలకంగా వ్యవహరిస్తారని ఆమె తెలిపారు.



## నిలిపివేసిన ఆర్టీసి బస్సుల ను వెంటనే నడిపించాలి విద్యార్థి సంఘాల డిమాండ్

**నారాయణపేట జిల్లా ప్రతినిధి అక్టోబర్ 15(జనంసాక్షి):** నారాయణపేట జిల్లాలోని అన్ని గ్రామాలకు బస్సులను నిలిపి వేయడంతో బస్సు డిపో ఇన్చార్జ్ అయిన ఎస్ ఐ అలివేలమ్మతో విద్యార్థి సంఘాలు ఎస్ఎఫ్ఐ,పిడి ఎస్ యు నాయకులు వాగ్వాదానికి దిగారు. ఈ సందర్భంగా పిడి ఎస్ యి జిల్లా సహాయ కార్యదర్శి వెంకటేష్,ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పవన్ మాట్లాడు తూ బస్సులను నిలిపివే యడం సరైనది కాదని అన్నారు. దానివల్ల విద్యార్థు లు చాలా ఇబ్బందికి గురవు తున్నారని దాదాపు తమ గ్రామాల నుండి 2,3 కిలోమీటర్లు నడిచి ఆటోలకు వస్తున్నారని అన్నారు. ఆర్టీసి లాభాల కోసం మాత్రమే ఆలోచించకుండా జిల్లా కేంద్రంలోకి చదువుకోవడం కోసం వస్తు న్న విద్యార్థుల గురించి కూడా ఆలోచించాలని అన్నారు. ఒకపక్క విద్యారంగంలో ప్రభు త్వ రంగం వెనుక పడుతూ ఉంటే దానికి ముఖ్య కారణం ఆయా గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం లేనందు వలన చాలామంది విద్యార్థు లు మధ్యలోనే చదువు ఆపే స్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.. ఉన్న గ్రామాలకు కూడా ఆర్టీసీ బస్సులను టైంకి నడిపించకపోవడం అలాగే ఎప్పుడు పడితే అప్పుడు నిలిపివేయడం వల్ల విద్యార్థులు పై చదువుల కోసం నారాయణపేట జిల్లా కేంద్రానికి రావడంలో ఇబ్బందికి గురవుతున్నారని అన్నారు. ఈ విషయం ప్రతి సారి ఆర్టిసి డిపో అధికారు లకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోకుండా విద్యా ర్థులతో ఆటలాడుతున్నారనీ ఆగ్రహం వ్యక్తం చేశారు ఇప్పుడు కూడా ఆర్టీసీ బస్సు లను



నిలవడంతో వారు వాగ్వాదనికి దిగారు. అలాగే నిలిపి వేసిన ఆర్టీసీ బస్సు లను వెంటనే నడిపించాలని అన్నారు. ఒకవేళ లేనిచో అన్ని గ్రామాల్లోనీ విద్యార్థులతో కలిసి ఆర్టీసీ డిపో ముందు అలాగే రోడ్ల పైన ధర్నాలు చేపడతామని,ఆర్టీసీ బస్సులను అన్నిటిని నిలిపివేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి మహేష్,జిల్లా అధ్యక్షుడు భాను, జిల్లా నాయకులు సురేష్ , నాయకులు కార్తీక్,సురేష్, అనిల్ తో పాటు మిగతా నాయకులు పాల్గొన్నారు.

## చదువుతో పాటు కళలలో రాణించాలి

### ఏఎంఓ విద్యా సాగర్

### ఆకట్టుకున్న కళా ప్రదర్శనలు

**నారాయణపేట జిల్లా ప్రతినిధి అక్టోబర్ 15(జనంసాక్షి):** విద్యార్థులు చదువుతో పాటు కళలలో రాణించాలని విద్యా శాఖ ఏ ఎం ఓ.విద్యా సాగర్ అన్నారు. బుధవారం విద్యాశాఖ,సమగ్ర శిక్ష సంయుక్త ఆధ్వర్యంలో పట్టణంలోని బాలికల పాఠశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి జానపద నృత్య పోటీలు ఘన విజయవం తంగా జరిగాయి. జిల్లాలోని పలు ప్రభుత్వ, జెడ్‌పి, మోడల్ , కేజీబీవీ పాఠశాలల నుండి వచ్చిన విద్యార్థులు తమ సాంస్కృతిక ప్రతిభను ఉజ్వలంగా ప్రదర్శించారు. ఈ పోటీల్లో విద్యార్థులు 11 విభిన్న థీమ్‌లలో పాల్గొని ప్రజా సాంస్కృతిక వైభవాన్ని ప్రదర్శించారు. ప్రతి బృందం తమ గ్రామీణ సంప్రదాయా లు, జానపద వేషధారణలు, సంగీతం, నృత్య చాతుర్యంతో ప్రేక్షకులను అలరించారు. వేదిక మొత్తం రంగుల హరివి ల్లు మాదిరిగా కళాకళలతో నిండిపోయింది. ఈ పోటీల్లో విజేతలుగా మొదటి బహు మతి డి. లావణ్య అండ్ గ్రూప్ పీఎం శ్రీ జెడ్‌పిహెచ్ఎస్ దామరగిద్ద,రెండవ బహుమతి కేజీబీవీ నర్వ,మూడవ బహుమతి ప్రభుత్వ అభ్యసన ఉన్నత పాఠశాల, నారాయణపేట గెలుచుకున్నారు.ప్రథమ బహుమతి గెలుచుకున్న బృందం రాష్ట్ర



స్థాయి పోటీల కు ఎంపిక చేశారు. జిల్లా స్థాయిలో పాల్గొన్న ప్రతి విద్యార్థికి ప్రోత్సాహక సర్టిఫి కెట్లు అందజేదారు. ఏఎంఓ విద్యాసాగర్ మాట్లాడుతూ.. విద్యార్థులు పాఠ్యాంశాలతో పాటు తమలో దాగి ఉన్న కళా నైపుణ్యాలను వెలికి తీయాలని అన్నారు. ఈ రకమైన పోటీలు విద్యార్థుల ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించి, జీవిత ఒత్తిడిని అధిగమిం చే శక్తిని ఇస్తాయన్నారు. కళలు మానసిక వికాసానికి మార్గం చూపుతాయనీ అన్నా రు. అలాగే విద్యార్థులు సృజనాత్మక ఆలోచనలతో ముందుకు సాగాలని సూచిం చారు. రాష్ట్రస్థాయిలో జిల్లా ప్రతిభ ప్రతిధ్వనించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్ర మంలో స్థానిక బాలికల ఉన్నత పాఠశాల ఎచ్ ఎం. హనీఫ్, ఉపాధ్యాయులు కనకప్ప, పర్వీన్ బేగం, లక్మన్, కథలప్ప తదితరులు పాల్గొన్నారు.

## నేడు పాలమూరు కు రాష్ట్ర గవర్నర్ రాక

### బందోబస్తుపై ఎస్పి సమీక్ష




**మహబూబ్నగర్ బ్యూరో15 (జనంసాక్షి):** రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ నేడు మహబూబ్నగర్ జిల్లా కేంద్రంలో పర్యటించనున్నారు. ఈ మేరకు అధికారిక కార్యక్రమం షెడ్యూల్ ఖరారైంది. జిల్లా కేంద్రంలోని పాలమూరు యూనివర్సిటీలో రాష్ట్ర గవర్నర్ నాలుగవ స్థాతకోత్సవ కార్యక్రమానికి హాజరుకానున్నారు. అదేవిధంగా జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని ఐడిఓసి మీటింగ్ హాల్లో జరిగే అధికారిక కార్యక్రమాల్లో కూడా గవర్నర్ హాజరుకాను న్నారు. గవర్నర్ మొట్టమొదటిసారి మహబూబ్నగర్ కు వస్తున్నందున జిల్లా ఎస్పీ డి జానకి పోలీస్ పై బుధవారం అధికారులతో సమీక్ష నిర్వహించారు. యూనివర్సిటీ నందు పర్యటన ప్రదేశాన్ని సందర్శించే హైటెక్ ఫంక్షన్ హాల్ లో పోలీసు అధికారులకు సలహాలు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా పలువురు సిబ్బందికి ఆమె బ్రీఫింగ్ ఇచ్చారు. ట్రాఫిక్ నియంత్రణ ప్రజల రాకపోకల ఇబ్బందులు, ఇతర భద్రత అంశాలపై దృష్టి పెట్టాలని ఎస్పీ జానకి సూచించారు.

ఈ సమీక్ష సమావేశంలో అదనపు ఎస్పి ఎస్ బి రత్నం, డి.ఎస్.పి వెంకటేశ్వర్లు, డిసిఆర్‌బిడిఎస్‌పి రమణారెడ్డి, డిటిసి డిఎస్పి గిరిబాబు, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ వెంకటేష్, మహబూబ్నగర్ రూరల్ సిఐ గాంధీ నాయక్, వన్ టన్ సిఐ అప్పయ్య, టూ టౌన్ సిఐ ఎజాదుద్దీన్, ట్రాఫిక్ సీఐ భగవం తు రెడ్డి పోలీస్ అధికారులు హాజరయ్యారు.

## అబ్దుల్ కలాం జీవితం ఆదర్శణీయం

**మక్తల్, అక్టోబర్ 15 (జనంసాక్షి) :** భారత మాజీ రాష్ట్రపతి భారతరత్న డాక్టర్ అబ్దుల్ కలాం జీవితం ప్రతి ఒక్కరకి ఆదర్శనీయమని తెలుగు ఉపన్యాసాలు, సామాజిక వేత్త బిజ్వార్ మహేష్ గౌడ్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని జక్లేర్ న్యూ శాంతినికేతన్ పాఠశాలలో అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మహేష్ గౌడ్ మాట్లాడుతూ భారతమాత కన్న ముద్దుబిడ్డలలో అబ్దుల్ కలాం రత్నం లాంటివారని, దీక్ష పట్టుదల ఉంటే సామాన్యుడు కూడా ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని నిరూపించిన గొప్ప మానవతావాది కలామని తెలిపారు. యువతను తన ప్రసంగాలతో ప్రభావితం చేసిన మహా మేధావి అబ్దుల్ కలాం అని,సాధారణ వ్యక్తి నుంచి మిస్సైల్ మాన్ గా అబ్దుల్ కలాం ఎదిగారని, శాస్త్ర సాంకేతిక రంగంలో విశిష్ట సేవలు అందించి దేశం కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన గొప్ప వ్యక్తి కలాం అని కొనియాడారు. కలాంకు విద్యార్థులు అంటే అమితమైన ప్రేమని అందుకే ఆయన జయంతి సందర్భంగా అంతర్జాతీయ విద్యార్థి దినోత్సవం నిర్వహించుకుం టున్నామన్నారు. అబ్దుల్ కలాంకు 40 కి పైగా విశ్వవిద్యాలయాలు గౌరవ డాక్టరేట్ తో సత్కరించాయని, భారత ప్రభుత్వం పద్మభూషణ్,విభూషణ్ తో పాటు భారతదేశ అత్యున్నత పురస్కారమైన భారతరత్న ప్రధానం చేసిందని గుర్తు చేశారు. అబ్దుల్ కలాం ను ఆదర్శంగా తీసుకొని విద్యార్థులు తమ కలలను సాకారం చేసుకోవాలని మహేష్ గౌడ్ కోరారు.



# క్రమశిక్షణ,నిరంతర కృషి విద్యార్థుల విజయానికి కీలకము

**జిల్లా ఉపాధి కల్పనాధికారి డాక్టర్. ప్రియాంక**

**గద్వాల నడిగడ్డ,అక్టోబర్ 15 (జనంసాక్షి):** క్రమశిక్షణ,నిరంతర కృషి విద్యార్థుల విజయానికి కీలకమనీ జిల్లా ఉపాధి కల్పనాధికారి డాక్టర్. ప్రియాంక అన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం గట్టు మండలం,ఆలూరు జడ్‌పీహెచ్‌ఎస్ పాఠశాలలో పదవ తరగతి విద్యార్థుల కోసం ప్రేరణ, కెరీర్ ప్లానింగ్ తరగతులు నిర్వహించబడిన సందర్భంగా ఆమె విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడారు. చదువు, ప్రణాళిక, స్వీయ ప్రేరణ, సరైన కెరీర్ మార్గం, చదివిన విషయాన్ని అర్థం చేసుకోవడం వంటి అంశాలు విద్యార్థుల భవిష్యత్తు మెరుగుపరిచే ముఖ్యమైన మూలాధారాలు అని ఆమె అన్నారు. ఏదైనా కొత్త విషయం నేర్చుకునేటప్పుడు దాని అర్థం చేసుకొని చదవాలి. ప్రతి 45 నుండి 50 నిమిషాల తర్వాత 5-10 నిమిషాల విరామం తీసుకోవడం ద్వారా ఏకాగ్రత పెరుగుతుందనీ, సరైన ప్రణాళిక లేకపోతే ఎంత చదివిన ఫలితం ఉండదనీ, అందువల్ల టైమ్‌టేబుల్ రూపొందించి ప్రతిరోజూ దానిని కచ్చితంగా పాటించాలనీ ఆమె సూచించారు.అదేవిధంగా కష్టమైన సబ్జెక్టులను విద్యార్థులు ఉత్సాహంగా ఉండే సమయాల్లో చదవాలని, చదివిన విషయాన్ని వారాంతంలో లేదా నెలాఖరులో తప్పనిసరిగా పునఃపరిశీలించుకోవాలని సూచించారు. మంచి నిద్ర,ఆరోగ్యకరమైన ఆహారం,ఆటలు విద్యార్థుల మానసిక ఆరోగ్యాన్ని, చురుకుదనాన్ని పెంచుతాయని అన్నారు.చదువుతో



పాటు భవిష్యత్తు గురించి ఆలోచన కూడా అవసరం అని ,ఏ రంగంలో ఆసక్తి ఉందో ఆ రంగంలోనే నైపుణ్యం పెంపొందించుకోవాలనీ, పుస్తక జ్ఞానం మాత్రమే కాకుండా కమ్యూనికేషన్, టీమ్‌వర్క్ వంటి నైపుణ్యాలు కూడా నేర్చుకోవాలని విద్యార్థులను ప్రోత్సహించారు.అనంతరం జిల్లా స్థాయిలో జరిగిన వివిధ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం కె. నాగరాజు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

### కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు బాకీ ఎప్పుడు చెల్లిస్తారు

**బిఆర్ఎస్ పార్టీ సూటి ప్రశ్న**



**రేవల్లి, అక్టోబర్ 15 (జనంసాక్షి):** ఏదుల మండల కేంద్రంలో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్య ంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు అని దేవుల మీద ఒట్టు వేసి ప్రజలకు ఇస్తాం అన్నా హామీలు ఏమయ్యాయని నిలాదీస్తూ మహిళలకు, విద్యార్థులకు, రైతులకు, వికలాంగులకు, నిరుద్యోగులకు నెలా ఎంత ఎంతా బాకీ పడ్డారో వాటి వివరాలు కార్డు రూపంలో ముద్రించి, ఇంటి ఇంటికి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు రమేష్ యాదవ్, దోడ్ల రాములు, మండల సీనియర్ నాయకులు మహ్మద్, బాలస్వామి, ప్రవీణ్ రెడ్డి, అబ్దుల్లా, కృపాకర్ రెడ్డి, బుచ్చిరెడ్డి, వెంకటయ్య, పగడాల విష్ణు, హుస్సేన్, పాప్యానాయక్, రవి తదితరులు పాల్గొన్నారు.

### పశువులకు రోగాలు రాకుండా

# ముందు జాగ్రత్త వహించాలి

**- అడిషినల్ కలెక్టర్ చంద్రశేఖర్**



**ఝరాసంగం,అక్టోబర్15 (జనంసాక్షి):** రైతులు పశువులకు రోగాలు రాకుండా అవగాహన పెంచుకుని ముందు జాగ్రత్త వహించాలని సంగారెడ్డి జిల్లా అడిషినల్ కలెక్టర్ చంద్రశేఖర్ అన్నారు. బుధవారం ఝరాసంగం మండల పరిధిలోని కమాల్?పల్లి గ్రామంలో పశువైద్య మరియు పశుసంవర్ధక శాఖ సంగారెడ్డి జిల్లా వారి అద్వర్యంలో నిర్వహించిన ఉచిత పశువైద్య శిబిరానికి హాజరైనారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ పశువులలో రోగ నిరోధకశక్తి పెంచడానికి గాలికుంటు టీకాలు వేయించాలన్నారు. రైతులు పశువైద్యం పై అవగాహన పెంచుకోవాలన్నారు. సంగారెడ్డి జిల్లా ఆనిమల్ హస్బెండరీ జేడీ వసంతకుమారి మాట్లాడుతూ గేదెలకు సెక్స్ క్రోమోజోమ్ వేయించడం వల్ల 90 శాతం ఆడ దుడ్డెలు పుడుతాయిని10 శాతం మాత్రమే మగ దుడ్డెలు పుడుతాయన్నారు. ఈ ఇంజక్షన్ వేయించిన రైతు నుండి 250 రూపాయలు ఫీజు తీసుకుంటారని ఒకవేళ మగ దుడ్డె పుడితే ఆ మొత్తాన్ని రైతుకు తిరిగి ఇవ్వడం జరుగుతుందన్నారు. ఛర్మరోగం (లంపింగ్, డిసీజ్) వ్యాక్సినేషన్ 100 శాతం పూర్తిచేయడం జరిగిందన్నారు.పశువులకు ఛర్మరోగం వచ్చినా ఆయుర్వేదం పద్దతిలో రోగాన్ని తగ్గించవచ్చన్నారు. కార్యక్రమంలో ఐయస్‌డీసీ ఏడీ జితెందర్?రెడ్డి,ఏడీలు వర్మ, ప్రభాకర్, మండల పశువైద్యాధికారులు హర్షవర్ధన్‌రెడ్డి,సునీల్‌దత్,ఎంపీడీఓ మంజుల, నాయకులు హన్మంత్?రావు పాటీల్, కేతకీ ఆలయ చైర్మన్ చంద్రశేఖర్,రైతులు పాల్గొన్నారు.

# బస్సు కోసం విద్యార్థుల ధర్నా



**మహబూబ్ నగర్ బ్యూరో 15 (జనంసాక్షి):** బీతమ గ్రామానికి బస్సు కావాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులు ధర్నా చేసిన ఘటన మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. పాఠశాల, కళాశాల విద్యార్థులను తరలించేందుకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బస్సును ఈరోజు రద్దు ఆకస్మికంగా రద్దు చేయడం, అందుకు సంబంధించి వివరాలను ముందే తెలియకపోవడంతో దాదాపుగా నాలుగు గంటలపాటు ఎదురుచూసిన విద్యార్థులు ఆందోళనకు దిగారు. వీరికి ఏబీవీపీ మద్దతు పలకడంతో బస్టాండ్ ప్రధాన ద్వారం ముందు బైఠాయించి ధర్నా చేపట్టారు. విషయం తెలుసుకున్న ఆర్టీసీ డిపో అధికారులు విద్యార్థులకు నచ్చ చెప్పే ప్రయత్నం చేసి బస్సును ఏర్పాటు చేశారు. బస్సుల్లో ఎక్కేందుకు ప్రయత్నించిన విద్యార్థులకు ఆ బస్సు సరిపోకపోవడంతో ఆందోళన కొనసాగించారు. అక్కడికి చేరుకున్న రెండవ పట్టణ ఎస్సై విజయకుమార్ విద్యార్థులను సముదాయించి ధర్నా విరమింప చేశారు. కాగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కర్నూలు జిల్లాలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పర్యటన సందర్భంగా మహబూబ్ నగర్ డిపో నుంచి రోజువారిగా నడిచే , విద్యార్థుల బస్సులను, పల్లె వెలుగు, ఎక్స్ప్రెస్ బస్సులను అక్కడికి తరలించారు. 36 బస్సులు అద్దెకు తీసుకోవడంతో మహబూబ్ నగర్ డిపో పరిధిలో వేపూర్, పగిద్యాల మీదుగా కొత్తాబాద్ వెళ్లాల్సిన బస్సుల కొరత ఏర్పడింది.

# ప్రజలకు అందుబాటులో ఉండండి

**ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి**



**మహబూబ్‌నగర్ టౌన్ 15 (జనంసాక్షి):** మహబూబ్ నగర్ నగరంలో మిషన్ భగీరథ పైప్ లైన్లు పగిలిపోవడం చేత మహబూబ్ నగర్ నగరంలో గరవారం రోజులుగా మిషన్ భగీరథ నీటి సరఫరాలో అవరోధం ఏర్పడింది. ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ఆదేశాల మేరకు నగరంలోని 49 వార్డు లలో ఉన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజలకు అందుబాటులో ఉంటూ, నీటి కొరత తీర్చేం దుకు సహకరించాలని కోరడమైనది. నగరంలో ఎక్కడైనా బోర్లు రిపేరు ఉన్న వెంటనే వాటిని రిపేరు చేయించాలని నాయకులకు, కార్యకర్తలకు ఆదేశాలు ఇవ్వడమైనది. నగర పరిధిలో ఉన్న ప్రజలకు మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో అవసరమైన మేరకు నీటి సరఫరాను చేయాలని అధికారులను ఆదేశించారు.

## బిసి రిజర్వేషన్ బిల్లు ఆమోదానికి కేంద్రం మోకాలడ్డు

- హైకోర్టు విధించిన స్టేకు వ్యతిరేకంగా నిరసన ప్రదర్శన
- బిసి సంక్షేమ సంఘం మండలాధ్యక్షుడు శ్రీశైలం



**హత్నూర, అక్టోబర్15 (జనంసాక్షి):** రాష్ట్ర ప్రభుత్వం బిసి రిజర్వేషన్ ను 42 శాతానికి పెంచగా కేంద్ర ప్రభుత్వం ఆ బిల్లును ఆమోదించకుండా అడ్డుపడుతుందని బిసి సంక్షేమ సంఘం మండలాధ్యక్షుడు శ్రీశైలం యాదవ్ అన్నారు. మండలంలోని దౌల్తాబాద్ లో బుధవారం వారు విలేకరులతో మాట్లాడారు.స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ కోసం రిజర్వేషన్ లను ఖరారు చేస్తూ నోటిఫికేషన్ విడుదలయ్యాక హైకోర్టు స్టే విధించడం ఏమిటని ఆయన ప్రశ్నించారు.బిసిలు రాజకీయంగా ఎదగని వ్వకుండ కేంద్రం కుట్రపూరితంగా వ్యవహరిస్తోందని ఆయన మండిపడ్డారు.కేంద్ర ప్రభుత్వ వైఖరిని, హైకోర్టు విధించిన స్టేను నిరసిస్తూ ఈ నెల అన్ని జిల్లా, నియోజకవర్గ,మండల కేంద్రాల్లో నిరసన ప్రదర్శన నిర్వహించడం జరుగుతుందని ఆయన చెప్పారు.ఈ నెల 18న నిర్వహించనున్న బిసి బందు కార్యక్రమంలో బిసీలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు మారుతి రాజు తదితరులు పాల్గొన్నారు.

# బాల్య వివాహాల రహిత జిల్లాగా మెదక్

**జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్**



**మెదక్ జిల్లా బ్యూరో, అక్టోబర్ 15 (జనంసాక్షి):** బాల్య వివాహాల రహిత జిల్లా గా మెదక్ జిల్లాను తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. కలెక్టరే ట్ కార్యాలయంలో బుధవారం బాల్యవివాహ లేని జిల్లాగా కావటానికి గాను దేవాలయాల్లో బాల్య వివాహాలు జరగకుండా నోటీస్ బోర్డులను ఏర్పాటు చేయటకు జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో తయారుచేసిన గోడ పత్రిక ను కలెక్టర్ రాహుల్ రాజ్ టి డబ్ల్యు ఓ హేమ భార్గవి, కలిసి కలెక్టర్ ఆవిష్కరిం చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మెదక్ జిల్లాలో ఏ ఒక్క బాల్య వివాహా లు జరగకూడదని, అందుకోసం ప్రతి ఒక్కరూ చిత్త శుద్ధితో పని చేయాలి పిలుపు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో విజన్ సంస్థ డైరెక్టర్ వంగరీ కె ౖలాస్ , సంస్థ జిల్లా ప్రాజెక్టు కోఆర్డినేటర్ రాజు, నవనీత మొదలగు పాల్గొన్నారు.

# సిసి రోడ్డు నిర్మాణానికి భూమి పూజ

**జడ్చర్ల, అక్టోబర్ 15 (జనంసాక్షి):** జడ్చర్ల మండల పరిధిలోని కోడుగల్ గ్రామం మక్తపల్లిలో బుధవారం సిసి రోడ్, అండర్ డ్రైనేజీ నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్ రెడ్డి ఆదేశాల మేరకు రూ 24 లక్షల ముడా నిధులతో నిర్మాణ పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సెక్రెటరీ శ్రీశైలం, కాంగ్రెస్ నాయకులు రఘుమారెడ్డి, లక్ష్మారెడ్డి, రామస్వామి గౌడ్, నర్సింలు, బాలరాజ్ గౌడ్, సాయి రెడ్డి, సుధాకర్ రెడ్డి, బండ కృష్ణయ్య, రాంజీ నాయక్, వీర స్వామి, సుధాకర్, శంకర్ నాయక్, చెన్నయ్య, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.



# కేతకీలో జిల్లా అధికారుల ప్రత్యేక పూజలు

**ఝరాసంగం,అక్టోబర్ 15 (జనంసాక్షి):** జిల్లాలో పవిత్ర పుణ్యక్షేత్రమైన శ్రీ కేతకీ సంగమేశ్వర స్వామి ఆలయంలో బుధవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ (డీఎల్‌స్‌ఎ) సెక్రెటరి సౌజన్య, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి లలితాకుమారి,జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి వసంతకుమారిలు దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయంలో వెలసిన శివలింగానికి అభిషేకం నిర్వహించి స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కలు తీర్చుకున్నారు.ఆలయ ఈఓ శివరుద్రప్ప, ఆలయ కమిటి చైర్మన్ చంద్రశేఖర్ శాలువా పూలమాలతో సన్మానించారు. ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.



## పూజారి ఇంటి నిర్మాణం కొరకు 2.50 లక్షల విరాళం

### – మాజీ సర్పంచ్ విజయమ్మ పాండురంగారెడ్డి



ఉర్కొండ అక్టోబర్ 15, ( జనం సాక్షి) : పూజారి ఇంటి నిర్మాణం కొరకు రెండు లక్షల 50 వేల భారీ విరాళాన్ని ఇచ్చి తమ సేవా గుణాన్ని చాటుకున్నారు మాజీ సర్పంచ్ విజయమ్మ పాండురంగారెడ్డి. నాగర్ కర్నూల్ జిల్లా ఉరుకొండ మండలంలోని రాచాలపల్లి గ్రామములో వెలసిన శ్రీ సీతారామాంజనేయస్వామి ఆలయ పూజారి ఇంటి నిర్మాణానికి. గ్రామస్తులు చందాల ద్వారా నిర్మించడానికి నిర్ణయించుకోవడం జరిగింది. ఇంటి స్లాబ్ నిర్మాణం కోసం ఉర్కొండ మండలం రాచాలపల్లి మాజీ సర్పంచ్ విజయమ్మ పాండురంగారెడ్డిని సంప్రదించగా పూజారి ఇంటి కప్పు నిర్మాణం కొరకు 2లక్షల యాభై వేల రూపాయల విరాళం ఇవ్వడం జరిగింది . గుడికి అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తున్న గంగాపురం శ్రీధర్ రెడ్డి కుటుంబ సభ్యులకు శ్రీ సీతారామాంజనేయ స్వామి ఆలయ కమిటీ,రాచాలపల్లి ప్రజల తరుపున ధన్యవాదాలు తెలియజేయడం జరిగింది.

## మధ్యాహ్న భోజనంలో పురుగులు



మక్తల్, అక్టోబర్ 15 (జనంసాక్షి) : మఖ్తల్ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల లో అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ నాయకులు మధ్యహ్న భోజన పథకాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ నాయకులకు అక్కడ ఉన్న విద్యార్థులు మాట్లాడుతూ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మెనూ ప్రకారం భోజనం అనేది వండడం లేదని మెనూ ప్రకారం భోజనం చేయకపోవడంపై ఏబీవీపీ నాయకులు ప్రిన్సిపాల్, కాంట్రాక్టర్ నిర్లక్ష్యంపై వారు మండిపడ్డారు. అనంతరం అక్కడే ఉన్న ఒక విద్యార్థి భోజనంలో పురుగు రావడం పై ఏబీవీపీ నాయకులు తీవ్ర ఆగ్రహానికి లోనయ్యారు. ఏబీవీపీ నాయకులు డీఈవో కు ఫిర్యాదు చేశారు. ఈ విషయం పై గతంలో కూడా ఎబివిపి నాయకులు పలు మార్లు ఉన్నతాధికారులకు వినతి పత్రాలు అందించిన పట్టించుకొకుండా ద్వంద్వ వైఖరి పై వారు తీవ్రంగా మండిపడ్డారు. అనంతరం మధ్యన భోజనంలో పురుగుల విషయంలో సంబంధిత వారిని శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని ఎంఈఓ కు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎబివిపి నాయకులు వినయ్ కుమార్, సందీప్, బంటి, ఇందు, విజయలక్ష్మి, అభి, ఆనంద్, అనిల్, నరేందర్, నవీన్, రంజిత్, మహేష్, నాగేంద్ర తదితరులు పాల్గోన్నారు.

## చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేసిన ఎమ్మెల్యే



మల్దకల్ (జనంసాక్షి)గద్వాల జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి చేతుల మీదుగా మల్దకల్ మండలం పరిధిలోని ఎల్కూర్ గ్రామానికి చెందిన శివానందం కు చికిత్స నిమిత్తం మీదుగా సీఎం సహాయం నిధి క్రింద 7,000 రూపాయల చెక్కును అందజేశారు.మల్దకల్ మండలం పరిధిలోని మల్లెం దొడ్డి గ్రామానికి చెందిన తెలుగు గోవిందమ్మ కు చికిత్స నిమిత్తం మీదుగా సీఎం సహాయం నిధి క్రింద 6500 రూపాయల చెక్కునుఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ యార్డ్ ఛైర్మన్ కురువ హనుమంతు, మాజీ ఎంపీపీ రాజారెడ్డి, మాజీ సర్పంచ్ వెంకటేశ్వర్ రెడ్డి,నాయకులు వెంకటన్న, నరసింహారెడ్డి,చంద్రశేఖర్, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఎర్ర శేఖర్ పై అనిరుద్ రెడ్డి అక్కసు సరికాదు

### ముదిరాజ్ సంఘం ఖండన

నారాయణపేట జిల్లా ప్రతినిధి,(జనం సాక్షి): బిసి ముదిరాజ్ వర్గానికి చెందిన మాజీ ఎమ్మె ల్యే ఎర్ర శేఖర్ పై జడ్చర్ల ఎమ్మె ల్యే అనిరుద్ రెడ్డి అహంకా రంతో అక్కసు వెళ్లగక్కడం సరైంది కాదని ఆయన వ్యాఖ్యలను నారా యణపేట పట్టణ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు మిర్చి వెంకట య్య,ఉపాధ్యక్షుడు పళ్ల వెంక ట్ రాములు,ముదిరాజ్ యువసేన అద్యక్షుడు అపి రెడ్డిపల్లి రాము ఒక ప్రకటనలో తీవ్రంగాఖండించారు.ఎమ్మెల్యేగా గెలిచిన రెండేళ్లకే ప్రజల విశ్వాసం నమ్మకం కోల్పోయిన జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి మూడు సార్లు ఎమ్మెల్యే గా గెలిచి ప్రజ ల మదిలో నిలి చిన మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్‌పై విమర్శలు చేయడం చూస్తే ఒకవేళ ఎర్ర శేఖర్ కాంగ్రెస్ లో చేరితే తన ఉనికికే ప్రమాదమన్న అభద్రతా భావంతో ఉన్నారని స్పష్టం అవుతున్నదని అన్నారు. అందుకే అనిరుద్ రెడ్డి ఎర్ర శేఖర్‌పై అనుచితమైన విమ ర్శలు చేస్తున్నారన్నారు. జడ్చర్ల ఎమ్మెల్యే గా మూడు సార్లు ఎర్ర శేఖర్ ను గెలిపిం చుకున్న ఆ నియోజక వర్గ ప్రజలు సహించర న్నారు. రెడ్డి అహంకారంతో విమ ర్శలు చేస్తే రానున్న రోజుల్లో బిసిల దెబ్బ రుచి చూడక తప్పదని హెచ్చరించా రు.ఇకనైనా వినయంగా మాట్లాడాలని హితవు పలికారు.

## పేట ను ప్రశాంత వాతావరణంలో ఉంచుదాం : ఎస్పీ

నారాయణపేట జిల్లా బ్యూరో (జనం సాక్షి): నారాయణపేట జిల్లాను ప్రశాంత వాతావర ణంలో ఉంచుదాం అని జిల్లా ఎస్పి.డాక్టర్ జి.వినీత్ అన్నా రు.బుధవారం ఆయన జిల్లా మీడియా ప్రతినిధులతో చిట్ చాట్ కార్యక్రమంలో మాట్లాడారు. జిల్లా ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు కట్టుబడి ఉన్నారని తెలి పారు. డ్రగ్స్ ఫ్రీ తెలం గాణ డ్రగ్స్ ఫ్రీ నారాయణ పేట" లక్ష్యంగా గంజాయి , ఇతర మత్తు పదా ర్థాలపై కఠిన చర్యలు తీసుకుంటు న్నట్లు తెలి పారు. కమ్యూనల్ గొడవలు జరగకుండా ముంద స్తు చర్యలు తీసుకుంటు న్నామని అన్నారు.సివిల్ తగాదాలలో పోలీసు జోక్యం లేకుండా న్యాయపర మైన పరి ష్కారాలకే ప్రాధాన్యం ఇస్తా మని పేర్కొన్నారు.జిల్లాలో ట్రాఫిక్ సమస్యలు లేకుండా ట్రాఫిక్ సిబ్బంది నియామకం చేయడంతో పాటు నూతన సిగ్నల్ వ్యవస్థ ఏర్పాటు చేస్తు న్నట్లు తెలిపారు.మైనర్ డ్రై వింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్, ఓపె న్ డ్రింకింగ్‌లను అరికట్టేం దుకు ప్రత్యేక చర్యలు చేపడు తున్నామని వివరించారు.రాత్రి పూట పెట్రోలింగ్‌ను బలోపేతం చేసి దొంగత నాలను నిర్మూలించేందుకు చర్యలు తీసుకుంటు న్నట్లు తెలిపారు.అంతేకాకుండా జిల్లాలో శాశ్వత బోర్డర్ చెక్ పోస్ట్ ఏర్పాటు చేయడం ద్వారా చట్టవిరుద్ధ రవాణాపై పట్టు సాధిస్తున్నామని పేర్కొన్నారు.జిల్లాలో ప్రజా సమస్యలు తెలుసుకోవ డానికి డయల్ యువర్ ఎస్పీ కార్యక్రమం చేపట్ట బోతు న్నామని జిల్లా పరిధిలో క్యూఆర్ కోడ్



ద్వారా ప్రజా సమస్యలు తెలుసుకోవ డానికి త్వరలో ఏర్పాటు కు చర్యలు తీసుకుంటామని ఎస్పీ తెలిపారు.ప్రజలు పోలీ సు విభాగానికి సహ కరించాలని, ఏవైనా అనుమానాస్పద కదలికలు గమనించిన వెంట నే 100 నంబర్‌కు సమాచా రం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

## పెండింగ్ పనులను పూర్తి చేయాలి

### –జిల్లా కలెక్టర్ బి.యం సంతోష్

గద్వాల నడిగడ్డ,అక్టోబర్ 15 (జనం సాక్షి) : ర్యాలంపాడు పునరావాస కేంద్రంలో పెండింగ్ పనులను త్వరతగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బి.యం సంతోష్ సంబంధిత అధికారులకు ఆదేశించారు. పునరావాస కేంద్రంలో అన్ని సదుపాయాలు పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయబడుతున్నం దున, గ్రామ ప్రజలు ఇక్కడికి వచ్చి ఇళ్లు నిర్మించి జీవితం కొనసాగించాలని కలెక్టర్ అన్నారు. బుధవారం ధరూర్ మండలంలో ర్యాలంపాడు పునరావాస కేంద్రంలోని సదుపాయాలు కల్పించే అంశమై జిల్లా కలెక్టర్ బి.యం సంతోష్,గద్వాల శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి తో కలిసి గ్రామస్తులు, అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ర్యాలంపాడు గ్రామ ప్రజలు తమ భూములను అందజేయడం వలన,జిల్లాలో ఒక లక్ష 80 వేల ఎకరాలకు సాగునీరు అందించే 4 టీఎంసీ రిజర్వాయర్ నిర్మాణం పూర్తయిందని తెలిపారు. భూములు కోల్పోయిన ప్రజలకు ప్రభుత్వం పూర్తి బాధ్యతతో వాటిని పునరాసవ కేంద్రాలలో అందజేస్తోందని తెలిపారు. గ్రామ అభివృద్ధి కోసం రోడ్లు, త్రాగునీరు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాము,గ్రామ పంచాయతీ భవనాలు, సబ్ సెంటర్లు,అంగన్వాడి కేంద్రాలు, దేవాలయాలు, చర్చిలు లాంటి అన్ని అవసరాలను లేఅవుట్ ప్లాన్ ప్రకారం ప్రభుత్వం ఏర్పాటు చేస్తోందని చెప్పారు. ప్రతి ప్లాన్‌కి అనుగుణంగా కృషి చేయడం జరుగుతుందన్నారు. భూసేకరణలో 67 ఎకరాల 28 గుంటలు భూమిలో మొత్తం 823 ప్లాట్లను ఏర్పాటు చేయగా, ఇప్పటికే 695 ప్లాట్లను భూ నిర్వాసితులకు మంజూరు చేయడం జరిగిందని, సమస్యలు ఉన్న 5 ప్లాట్లను ఖాళీ ఉన్న ప్లాట్లలో మళ్లీ అందించడం జరుగుతుందని తెలిపారు. 78 ప్లాట్లలో నీరు నిలుస్తున్నందున, మట్టితో భర్తీ చేసే వాటిని లెవెల్ చేస్తామని తెలిపారు. అనుకూలంగా లేని మరో 14 ప్లాట్లను కూడా ఖాళీ ప్లాట్లలో మంజూరు చేయడం జరుగుతుందని, లేదా వాటికి సంబంధించిన నూతన భూసేకరణ కోసం తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. విద్యుత్ సమస్యలు, త్రాగునీరు, రోడ్లు, డ్రైనేజీలు లింక్ రోడ్లను త్వరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గ్రామానికి స్మశాన వాటికకు స్థలం కేటాయించడం జరుగుతుందని, అలాగే పెండింగ్‌లో ఉన్న షిఫ్టింగ్ చార్జీలను వెంటనే చెల్లించడం జరుగుతుందని తెలియజేశారు.

జిల్లాలో ఎక్కడా లేని విధంగా ఇందిరమ్మ ఇళ్ల కోసం ఈ గ్రామంలో 250 పైగా ఇళ్లు మంజూరు చేయడం జరిగిందని, మంజూరైన ప్రతి ఒక్కరు తమ ఇళ్లను త్వరితగతిన పూర్తి చేసుకోవాలని సూచించారు. ప్రతి సోమవారం వారి ఖాతాల్లో నిధులు జమ అవుతాయని, అవసరమైతే మహిళా సంఘాల ద్వారా రుణాలు అందించబడతాయని తెలిపారు. అర్హులైన వారికి రెండో విడతలో లబ్ధి పొందేందుకు తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.



గ్రామంలో ప్రభుత్వం ద్వారా అన్ని సదుపాయాలు పూర్తి స్థాయిలో కల్పించడం జరుగుతుందని, లబ్ధిదారులు ప్రతి ఒక్కరు తమ ఇళ్లు నిర్మాణాలను పూర్తిచేసుకుని సంతోషంగా, సౌభాగ్యవంతంగా జీవించాలని ఆకాంక్షించారు. గద్వాల శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి మాట్లాడుతూ,గద్వాల అభివృద్ధిలో ర్యాలంపాడు గ్రామం చేసిన త్యాగం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని అన్నారు.రైతులు తమ స్వంత వ్యవసాయ భూములను త్యాగం చేయడం వలన, 4 టీఎంసీ రిజర్వాయర్ నిర్మాణం సాధ్యమై, దాని ద్వారా ఒక లక్ష 80 వేల ఎకరాలకు సాగునీరు అందించడం జరిగిందని పేర్కొన్నారు.రైతుల త్యాగాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఎల్లప్పుడూ గుర్తుంచుకుంటుందని,వారికి తగిన గౌరవం, సదుపాయాలు కల్పించేందుకు కట్టుబడి ఉన్నామని తెలిపారు. గతంలో ముంపుకు గురైన ఆలూరు,చిన్నోనిపల్లి,నాగర్ దొడ్డి తదితర గ్రామాల్లో ఇప్పటికే అవసరమైన అన్ని రకాల సదుపాయాలు అందజేశామని తెలిపారు.ర్యాలంపాడు గ్రామానికి కూడా అదే విధంగా అన్ని వసతులు కల్పించేందుకు తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. ర్యాలంపాడు గ్రామంలో ఎక్కువ మంది ఇందిరమ్మ ఇళ్లకు అర్హులుగా గుర్తించి వారికి ఇందిరమ్మ గృహాలను మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. ప్రతి కుటుంబం తమకు కేటాయించిన స్థలాల్లో ఇళ్లు నిర్మించుకుని, కొత్తగా ఏర్పాటు చేసిన గ్రామాల్లో స్థిరంగా నివసించాలని సూచించారు.ఆర్ %ఆ% ఆర్ సెంటర్ లో అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించడం జరుగుతుందని, ప్రజలు ఎవరు కూడా ఆందోళన చెందకూడదని, అధికారులందరూ ఎప్పటికప్పుడు ప్రజలకు అందుబాటులో ఉండి సహాయ సహకారాలు అందిస్తారని తెలిపారు. ప్రజలకు పిలుపునిస్తూ, మీ సహకారంతోనే ఈ గ్రామం సమృద్ధిగా అభివృద్ధి చెందుతుందని తెలిపారు.అంతకు ముందు జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే లేఅవుట్ మ్యాప్‌ను పరిశీలించి,అన్ని పనుల వివరాలు,ప్రగతి పనుల పురోగతి గురించి చర్చించారు.అనంతరం గ్రామ ప్రజలు తమ సమస్యల పట్ల జిల్లా కలెక్టర్,ఎమ్మెల్యేకు వినతి పత్రాలను అందజేయగా, వాటిని పరిశీలించి వెంటనే పరిష్కరిస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లక్ష్మీ నారాయణ,ఆర్డీవో అలివేలు,తహసీల్దార్ నరేందర్, నీటి పారుదలశాఖ ఈ.ఈ శ్రీనివాసులు,సంబంధిత అధికారులు, ప్రజాప్రతి నిధులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## బాధ్యతాయుతంగా లేదంటే చర్యలు తప్పవు

### జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి బ్యూరో అక్టోబర్ 15 జనంసాక్షి : విద్యాశాఖ అధికారులు విధి నిర్వహణలో నిబద్దతతో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని లేదంటే చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి హెచ్చ రించారు. బుధవారం కలెక్టరేట్లోని కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ విద్యాశాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు.ఎంఈఓ లు, క్లస్టర్ హెడ్మాస్టర్ల పాఠశాలల సందర్శన నివేదికను తనిఖీ చేసిన కలెక్టర్, ఈ నెలలో ఇప్పటివరకు ఒక్క పాఠశాల కూడా సందర్శించని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.కలెక్టర్ మాట్లాడుతూ విద్యాశాఖ అధికారులు విధి నిర్వహణ లో నిబద్దతతో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని లేదంటే చర్యలు తీసు కోవడం జరుగుతుందని హెచ్చరించారు. సమాజంలో విద్యార్థులను ఉన్నత శిఖరాలను చేర్చి మంచి సమాజాన్ని నిర్మించడంలో ఉపాధ్యాయులు విద్యా శాఖ అధికారులు కీలక పాత్ర అని బాధ్యతాయుతంగా విధి నిర్వహణలో పాల్గొనాలని ఆదేశించారు.ఎంఈఓ లు, క్లస్టర్ హెడ్మాస్టర్లు తప్పనిసరిగా రోజుకు రెండు లేదా మూడు పాఠశాలలను విధిగా సందర్శించి పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. సందర్శించిన పాఠశాలల్లో ఎఫ్ ఎల్ ఎన్ అటెం డెన్స్, అపార్ ఐడి జనరేషన్ పై దృష్టి సాధించి మెరుగుపరిచే విధంగా చర్య లు తీసుకోవాలన్నారు.అదేవిధంగా ఈ సంవత్సరం పదో తరగతి బోర్డు ఫలితాల్లో విద్యార్థులు 100% ఉత్తీర్ణత సాధించాలని, ఒక్కరు కూడా ఫెయిల్ అవ్వడానికి ఆస్కారం ఉండొద్దని ఆదేశించారు.సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి అబ్దుల్ ఘని, ఎంఈఓ లు, క్లస్టర్ హెడ్మాస్టర్లు, ఇతర అధికారులు తదితరులు ఉన్నారు.

# గీతంలో ప్రపంచ మానసిక ఆరోగ్య వారోత్సవాలు

**పటాన్చెరువు, అక్టోబర్15(జనంసాక్షి)**
గీతం స్కూల్ ఆఫ్ సోషల్ సైన్సెస్ లోని అప్లైడ్ సైకాలజీ విభాగం ఈనెల 10నుండి16వ తేదీ వరకు ప్రపంచ మానసిక ఆరోగ్య వారోత్సవాలను నిర్వహిస్తోంది. ఇది ప్రపంచ మానసిక ఆరోగ్య విద్య, అవగాహన, సామాజిక వివక్షకు వ్యతిరేకంగా బలమైన వాదనను ప్రోత్సహించాలని లక్ష్యించారు. 'మానసిక ఆరోగ్యం లేకుండా సంతోషంగా ఉండలేరు' అనే నినాదంతో, ముఖ్యంగా సంక్షోభాల సమయంలో వ్యక్తుల మానసిక శ్రేయస్సుకు మద్దతు ఇవ్వడం చాలా ముఖ్యమని, అది ప్రాణాలను కాపాడడమే గాక మానసిక దృఢత్వాన్ని పెంపొందిస్తుందని, వ్యక్తులు, సమాజాలను బలపరుస్తుందని విశ్వసిస్తున్నారు. వారం రోజుల కార్యక్రమాలలో భాగంగా, మనస్తత్వ శాస్త్ర విద్యార్థులు ఒత్తిడి, ఆదర్శ లేదా నిజమైన స్వీయ ఆందోళనను అర్థం చేసుకోవడంపై ఆర్ట్ థెరపీ కార్యశాలబీ కెరీర్, ఆరోగ్యం, శ్రేయస్సు, తెలివితేటలు, వ్యక్తిత్వం, సంబంధాలపై మానసిక స్థితిని పరీక్షించే మైండ్ క్వెస్ట్‌బీ వివక్ష, సంస్కృతి, మనస్సును విప్పడంపై ఆతిథ్య ఉపన్యాసం, ఓ సరదా స్కిట్, ఓపెన్ మైక్ వంటి పలు ముఖాముఖి, సృజనాత్మక





కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. వీటితోపాటు రిజల్యూషన్, కృతజ్ఞతా చెట్టు, భావోద్వేగాల బూత్, బయో-మోడల్ ప్రెజెంటేషన్, లెటర్స్ టు యువర్ ఫ్యూచర్ సెల్ఫ్ వంటివి కూడా నిర్వహించారు. ఇవన్నీ ఆత్మపరిశీలన, సానుభూతిని పెంపొందించేలా రూపొందించారు.

**మానసిక సమస్యలపై**
**ప్రజా అవగాహన అవశ్యం: డాక్టర్ దల్జీత్ కౌర్**

మానసిక ఆరోగ్యం గురించి చర్చించడంలో దాపరికం లేకుండా వ్యవహరించడం, సహాయం కోరడానికి సంకోచించకూడదనే ప్రజా అవగాహన ప్రయత్నాలు ముడిపడి ఉన్నాయని కన్సల్టెంట్ సైకియాట్రిస్ట్, డాన్ హెల్తీ మైండ్స్ వ్యవస్థాపకురాలు డాక్టర్ దల్జీత్ కౌర్ అన్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్య వారోత్సవంలో భాగంగా, బుధవారం ఆమె గీతంలో 'వివక్ష, సంస్కృతి, మనస్సు విప్పడం'పై ఆతిథ్య ఉపన్యాసం చేశారు. ఇంగ్లాండ్ యొక్క టైమ్ టు చేంజ్ ప్రచారం గురించి చెబుతూ, మానసిక అనారోగ్యాన్ని బలహీనతగా భావించే సామాజిక పక్షపాతాలను ఎదుర్కోవడానికి స్వీయ కథలు, భాషా సంస్కరణల ప్రాముఖ్యతను ఆమె ప్రముఖంగా ప్రస్తావించారు. సంస్కృతిని మానసిక శ్రేయస్సు కోసం వనరుగా చూడవలసిన అవసరాన్ని ఆమె నొక్కి చెప్పారు.

## గోదుమ లారీ బోల్తా



శివ్వంపేట, జనంసాక్షి : మండల పరిధిలోని చిన్నగొట్టిముక్ల గ్రామ శివారు ప్రాంతం చాకరిమెట్ల సమీపంలో బుధవారం సాయంత్రం ఒక లారీ అదుపుతప్పి బోల్తా కొట్టింది. ప్రయాణికులు తెలిపిన వివరాలు ప్రకారం మధ్యప్రదేశ్ రాష్ట్రం బేతుల్ ప్రాంతం నుంచి సంగారెడ్డి జిల్లా పటాన్ చేరుకు గోధుమ సంచుల లోడ్ తో వెళ్తున్న లారీ చాకరిమెట్ల సమీపంలో ప్రమాదవశాత్తు అదుపు తప్పి బోల్తా పడింది. ఇది గమనించిన రోడ్డు వెంట వెళ్లే ప్రయాణికులు క్యాబిన్ లో ఉన్న లారీడ్రైవర్ వివేక్ ఠాకూర్, క్లీనర్ కైలాస్ సత్కర్ లను గమనించి బయటకు తీశారు. ఈ లారీ రోడ్డు బోల్తా ప్రమాదంలో డ్రైవర్, క్లీనర్ లకు ఎలాంటి గాయాలు కాకుండా ప్రాణాలతో బయట పడటం అదృష్ట మంటూ ప్రయాణికులు అన్నారు.

## డీసీసీ అధ్యక్ష పదవి కోసం మంజె నామినేషన్




చేర్యాల (జనంసాక్షి) : సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్ష పదవి కోసం చేర్యాల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు మంజే మల్లేశ్ ముదిరాజ్ బుధవారం జిల్లా కేంద్రంలో నామినేషన్ వేశారు. సిద్దిపేట జిల్లాలో చేర్యాల మండలం వీరన్నపేట గ్రామానికి చెందిన మంజే మల్లేశం కి ఇటు సిద్దిపేట జిల్లాతోపాటు జనగామ నియోజకవర్గంలో మంచి పట్టు ఉంది. కాంగ్రెస్ పార్టీలో సీనియర్ కార్యకర్తగా 20 సంవత్సరాలుగా పనిచేస్తూ పార్టీకి అంకిత భావంతో పనిచేస్తున్నారు. డీసీసీ అధ్యక్ష పదవి కోసం జిల్లా కేంద్రంలో ఏసీసీ పరిశీలకులకు తన నామినేషన్ పత్రాలను అందజేశారు.

## రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు తూప్రాన్ గీతా విద్యార్థి ఎంపిక



తూప్రాన్ (జనం సాక్షి): ఎస్‌జీఎఫ్ ఉమ్మడి మెదక్ జిల్లా వాలీ బాల్ పోటీలు ఈ నెల 14న సిద్దిపేట జిల్లా ప్రజ్ఞాపూర్‌లో జరిగిన అండర్- 14 వాలీబాల్ విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబరచిన తూప్రాన్ గీతా స్కూల్ ఎనిమిదవ తరగతి విద్యార్థి పెంజర్ల తరుణ్ రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ రామాంజనేయులు తెలిపారు ప్రిన్సిపాల్ ప్రేమ్ రాజ్ తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్, చైర్ పర్సన్ పి. ఉష, డైరెక్టర్లు రాఘవేందర్ గౌడ్, నారాయణ గుప్త, భరత్, డాక్టర్ మౌనిక, ఇంచార్జి ప్రిన్సిపాల్ ప్రేమ్ రాజు, వజ్జ రాజేశ్వర్ ,పీఈటీలు శైలేందర్,కరుణాకర్,స్వప్న, జ్యోత్స్న ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

## మోటారు సరిచేయడానికి వెళ్లి..



పాపన్నపేట, అక్టోబర్ 15 (జనంసాక్షి) : ప్రమాదవశత్తు ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మెదక్ జిల్లా కుర్తివాడ గ్రామంలో వెలుగు చూసింది. ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ తెలిపిన వివరాలు..గ్రామానికి చెందిన పక్రమొల్ల ఆబేద్ 53 గ్రామ శివారులో భూమిని కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నాడు. పంట ఎండి పోవడంతో మోటార్ సరి చేయడానికి గ్రామానికి చెందిన మరో వ్యక్తితో కలిసి మంజీర నది ఒడ్డుకు చేరుకున్నారు. అక్కడ మోటర్ పైపు సరిచేస్తూ ఆబేద్ నీట మునిగాడు. ఎంత సేపటికీ పైకి రాకపోవడంతో అక్కడే ఉన్న మరో వ్యక్తి కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. మంగళవారం సాయంత్రం మంజీరా నదిలో వెతికినప్పటికీ ఆచూకీ దొరకలేదు. బుధవారం ఉదయం మరోసారి గాలింపు చేపట్టాగా ఆయన మృతదేహం లభ్యమైంది. మృతుడి భార్య షహనాజ్ బీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెల్లడించారు.

## 368 పశువులకు గాలికుంటూ వ్యాధి టీకాలు



తూప్రాన్ అక్టోబర్ 15( జనం సాక్షి): 7వ జాతీయ గాలి కుంటు నివారణ కార్యక్రమం లో భాగంగా పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు వేస్తున్నట్లు పశువైద్యాధికారి లక్ష్మి తెలిపారు. అక్టోబర్ 15 నుంచి నవంబర్ 14 వరకు రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతుందని ఈ కార్యక్రమం తూప్రాన్ మనోహరబాద్ రైతులు అందరూ ఉపయోగించు కొవాలనీ కోరారు. ఈ కార్యక్రమంలో తూప్రాన్ మండలం లోని పడాల పల్లి, ఇస్లాంపుర్ గ్రామల్లో మనోహరబాద్ లోని పోతారం , జీడిపల్లి గ్రామాలలో టీకాలు వేసినట్లు చెప్పారు. పడాల పల్లి లో 251, 32 తెల్లపశువులకు, ఇస్లాంపుర్ లో 117 నల్ల , 47 తెల్ల పశువులకు టీకాలు వేసినట్లు చెప్పారు.

## రెండు బైకులు ఢీ...వ్యక్తి మృతి



చిలప్ చేడ్,15 అక్టోబర్ జనంసాక్షి :- ఎదురెదురుగా రెండు బైకులు ఢీకొని వ్యక్తి మృతి చెందాడు.మరో ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన కథనం ప్రకారం. చిలప్ చేడ్ మండలం రహీమ్ గూడా తండాకు చెందిన కేతావత్ శర్మన్ వయసు 55 సం.లు గల వ్యక్తి శీలంపల్లి గ్రామం నుండి తన స్వగ్రామనికి వెళుతుండగా,గంగిరెద్దుల గూడెంకు చెందిన బత్తుల శ్రీను బైక్ పై ఎక్కాగా సోమక్కపేట గ్రామానికి చెందిన బందెల్లి అనే వ్యక్తి శీలంపల్లి వైపు వెళ్తుండగా.శీలంపల్లి గ్రామ శివారులో రెండు బైకులు ఎదురెదురుగా ఢీ కొన్నాయి.రెండు బైకులు ఢీ కొనడంతో బత్తుల శ్రీను బైక్ పై కూర్చున్న కేతావత్ శర్మన్ వెనకాలకు పడడంతో అక్కడిక్కకడే మృతి చెందాడు.వాహనాలు నడుపుతున్న శ్రీను,బందెల్లికి తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని గాయాలు అయిన శ్రీను, బందేల్లి లను చికిత్సకొరకు హాస్పిటల్ కి తరలించి అక్కడే ఉన్నటువంటి మృతదేహాన్ని జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## మదూర్ మాజీ ఉపసర్పంచ్ మృతి బాధాకరం

**నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి**



చిన్నశంకరంపేట,(జనం సాక్షి) చిన్న శంకరంపేట మండలం మదూర్ మాజీ ఉప సర్పంచ్, ఉద్యోగి గంగుల రమేష్ అనారోగ్యంతో బుధవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మెదక్ టిఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి రమేష్ కుటుంబాన్ని పరామర్శించారు. ఆమె మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పనిచేసిన రమేష్ గత స్థానిక ఎన్నికల్లో గెలిచి ఉప సర్పంచ్ గా గెలుపొంది తర్వాత ప్రభుత్వ ఉద్యోగం రావడం అనారోగ్యానికి గురికావడం మృతి చెందడం పార్టీకి తీరనిలోటని పేర్కొన్నారు. ప్రజా ప్రతినిధులు ఆయన మృతికి సంతాపం ప్రకటించారు. పలువురు అంతక్రియలో పాల్గొన్నారు.

## 11 ఎకరాల్లో ఆయిల్ ఫామ్ సాగు : ఏవో



శివ్వంపేట, జనంసాక్షి: ఆయిల్ ఫామ్ సాగు కోసం రైతులు పెద్ద ఎత్తున ముందుకు రావడం ఎంతో అభినందనీయమని మండల వ్యవసాయ శాఖ అధికారి ఎన్. లావణ్య పేర్కొన్నారు. మండల పరిధిలోని కొత్తపేట గ్రామంలో సత్యనారాయణ అనే రైతు తన 7 ఎకరాల 20 గుంటల భూమిలో ఆయిల్ ఫామ్ మొక్కలను నాటారు. అదేవిధంగా ఇదే గ్రామానికి చెందిన మహిళ లక్ష్మీ అనే రైతు 3 ఎకరాల 20 భూమిలో బుధవారం ఆయిల్ పామ్ మొక్కలను నాటడం జరిగింది. ఈ సందర్భంగా ఏవో లావణ్య మాట్లాడుతూ ఆయిల్ ఫామ్ పంట సాగులో ప్రభుత్వం సబ్సిడీ రూపంలో 200 రూపాయల ఉన్న మొక్కను, కేవలం 20 రూపాయలకు అందజేయడం జరుగుతుందన్నారు. అలాగే డ్రిప్ సబ్సిడీ ఎస్సీ, ఎస్టీ రైతులకు 100 శాతం, సాధారణ రైతులకు 90 శాతం వరకు రాయితీ ఇస్తున్నదని ఆమె గుర్తు చేశారు. ఆయిల్ పామ్ వేసుకోవడం వలన మంచి దిగుబడులు సాధించి, ఆర్థికంగా రైతు కుటుంబాలు అభివృద్ధి చెందడానికి వీలవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన శాఖ అధికారి సంతోష్, హెచ్ఈవో వివేక్, వ్యవసాయ విస్తీర్ణ అధికారి మౌనిక, లీవ్ ఫామ్ రిసోర్సెస్ కంపెనీ టెక్నికల్ పర్సన్ అజయ్, రైతులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిభిరం అభినందనీయం



శివ్వంపేట, జనంసాక్షి: ఉచిత వైద్య శిభిరం నిర్వహించి, రోగులకు మందులు అందజేయడం అభినందనీయమని మాజీ సర్పంచ్ కన్నారం దుర్గేష్, ఉప సర్పంచ్ ములుగు నాగేశ్వర్ రావు పేర్కొన్నారు. మండల పరిధిలోని దాంతన్ పల్లి గ్రామంలో ఆర్వీఎం అనే ప్రైవేటు ఆసుపత్రి వారు బుధవారం ఉచిత వైద్య శిభిరం నిర్వహించి, సుమారు 200 మందికి పైగా ఉచితంగా వైద్య పరీక్షలు జరిపి వారికీ అవసరమైన మందులను పంపిణీ చేశారు. అయితే ఇందులో శాస్త్ర చికిత్సల కోసం నలుగురిని గుర్తించి రెఫర్ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు శుభం, సౌమ్య, సింధు, మానస్ మేనేజర్ లక్ష్మణ్, ఎగ్జిక్యూటివ్ ప్రకాష్ నాయకులు నర్సింలు, శివ కుమార్, శ్రీనివాస్, మధు లతో పాటు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అబ్దుల్ కలాం జయంతి



**టేక్మాల్, (జనం సాక్షి)**
భారత మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం జయంతి ఘనంగా నిర్వహించారు. బొడ్మట్ పల్లి చౌరస్తాలో అబ్దుల్ కలాం విగ్రహనికి గ్రామ మాజిసర్పంచ్ కలాలి స్వరూప దశరథ్‌గౌడ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. లీడ్ ఇండియా మాస్టర్ ట్రైనర్ కొటం గారి శంకరయ్య మాట్లాడుతూ అబ్దుల్ కలాం పేపర్ బాయ్ నుండి ప్రెసిడెంట్ వరకు ఎదిగిన మహానీయుడు ఉన్నత స్థాయికి ఎదిగినటువంటి మహోన్నతమైనటువంటి వ్యక్తి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం అందుకే యుఎన్ఓ అంతర్జాతీయ విద్యార్థి దినోత్సవంగా ప్రకటించడం మన దేశానికి గర్వకారణం అంతేకాకుండా అబ్దుల్ కలాం డిఆర్డిఓ ఇస్రో వంటి వాటిలో కీలక పాత్ర పోషించి దేశ ఖ్యాతిని చాటారు. పిఏసిఎస్ మాజీ డైరెక్టర్ చీలపల్లి రవిశంకర్, ఘటంగారి ఈశ్వరప్ప, కంకర భరత్ భూషణ్, కలాలి రాజేశ్వర్ గౌడ్, కొటం గారి పాపయ్య,కొల్లపల్లి శ్రీనివాస్, తలారి మందీర్, కంకర విఠల్, బేగరీ శంకరయ్య, పాండు, నాగయ్య, కంకర చెన్నయ్య, తంప్లూరి కృష్ణ,భవాని అరుణ్, కంకర మల్లయ్య,కంకర బీరప్ప,కంకర మల్లేష్ పాల్గొన్నారు.

# ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా

మహబూబ్ నగర్ టౌన్ 15 (జనం సాక్షి )బీఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని టీపీసీసీ కోఆర్డినేటర్, ఆర్టీసీ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా గౌరవాధ్యక్షులు దార భాస్కర్ అన్నారు. జిల్లా కేంద్రంలో టీజీఎస్ఆర్టీసీ ఉద్యోగుల ఎస్సీ, ఎస్టీ సంక్షేమ సంఘం జిల్లా కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. సంఘం ఉమ్మడి జిల్లా నూతన గౌరవాధ్యక్షుడిగా దార భాస్కర్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో దార భాస్కర్ మాట్లాడుతూ సంఘం సభ్యులకు ఏ సమస్య వచ్చినా పరిష్కరించడానికి అన్ని వేళలా అందుబాటులో ఉంటానని తెలిపారు. అనంతరం దార భాస్క ర్ ను సంఘం ప్రతినిధులు ఘనంగా సన్మానం చేశారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం రీజినల్ కార్యదర్శి దార సుందర్, నాయకులు చంద్రయ్య, నర్సింహ్మా, కృష్ణ నాయక్, రామన్న, వెంకటయ్య, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



## పుదుచ్చేరి మాజీ ముఖ్యమంత్రి నారాయణస్వామిని సన్మానించిన

శ్రీరంగాపూర్ అక్టోబర్ 15 (జనం సాక్షి ) : జిల్లా కాంగ్రెస్ పార్టీ నియామకం పక్రియ కొరకు వనపర్తి జిల్లాలో కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వచ్చిన సందర్భంగా పుదుచ్చేరి మాజీ ముఖ్యమంత్రి వి నారాయణస్వామి మరియు అలీ ఖాన్ ఎమ్మెల్సీ,శ్రీనివాస్,భోజ్జ సంధ్యారెడ్డి, కోటేశ్వరరావు, గార్లకు మర్యాదపూర్వకంగా కలిసి వారిని శాలువతో శ్రీరంగాపూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాములు యాదవ్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి,తుడిమేగా రెడ్డి వనపర్తి శాసనసభ్యులు,మరియు రాజేంద్రప్రసాద్ యాదవ్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు,నందిమల్ల యాదయ్య,పిసిసి జనరల్ సెక్రెటరీ రాజీవ్ రెడ్డి, పిసిసి ఉపాధ్యక్షులు మండల అధ్యక్షులు పట్టణ అధ్యక్షులు జిల్లా అనుబంధ సంఘాల అధ్యక్షులు ముఖ్య నాయకులు తదితరులు పాల్గొనడం జరిగినది.

**తాటిపాముల గ్రామానికి సబ్ స్టేషన్ మంజూరు.**

తాటిపాముల గ్రామానికి సబ్ స్టేషన్ మంజూరుకై సహకరించిన గౌరవనీయులు ప్రాణాలిక సంఘం ఉపాధ్యక్షుడు జీ చిన్నారెడ్డి,వనపర్తి శాసనసభ్యుడు తుడిమెగా రెడ్డి గారికి గ్రామం తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.ఈరోజు మన గ్రామానికి సబ్ స్టేషన్ సంబంధించినటువంటి ఎలక్ట్రిసిటీ ఏఈ గారు తాటిపాముల గ్రామానికి వచ్చి స్థలాన్ని పరిశీలించడం జరిగినది. మా గ్రామానికి సబ్టేషన్ మంజూరు చేసినందుకు గ్రామ ప్రజల తరపున ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డికి వనపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే మెగా రెడ్డి కి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రాములు యాదవ్ ధన్యవాదాలు తెలియజేశారు.

## గృహలక్ష్మి పథకం.. బతుకమ్మ చీరలు ఎక్కడ..?

కృష్ణ, అక్టోబర్, 15 (జనం సాక్షి): గత ఎమ్మెల్యే ఎలక్షన్లో ఇచ్చిన హామీలను అమలు చేయలేదని మండలం బిఆర్ ఎస్ నాయకుడు మ్యాకల్ భీమ్ ఒక ప్రకటనలో మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను అమలు చేస్తున్నమని హామీ ఇచ్చారు. కానీ అందులో ఒకటి గృహలక్ష్మి పథకం కూడా ఉందని ఆయన గుర్తు చేశారు. తెల్ల రేషన్ కార్డు ఉన్న ఇంటి మహిళలకు నెలకు 2,500/- రూపాయలు చొప్పున ప్రతినెల ఇంటి ఖర్చులకు ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. కానీ నేటికీ అమల చేయలేదనీ అన్నారు. ఆరు గ్యారెంటీలలో కేవలం ఉచిత బస్సు ప్రయాణం ఒక్కటే అమలు చేస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ సాధ్యం కాని హమిలు ఇచ్చి ప్రభుత్వం ఇప్పుడు మోకం చటెసిందన్నారు. బతుకమ్మ పండుగ చీరలు పంపిణీ ఎక్కడ ...? చేస్తున్నారని ఆయన దుయ్యబడ్డారు అలాగే గ్యాస్ సిలిండర్లో సబ్సిడీ ఇస్తామని అన్నారు కానీ అమలు చేయలేదని అన్నారు .

## యువత భవిత కోసం తపించిన మహా తపస్వి

ఉర్కొండ అక్టోబర్ 15, ( జనం సాక్షి ) : మండల కేంద్రంలోని స్థానిక శ్రీ వేంకట బాల్ రామయ్య పాఠశాలలో భారత మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న పాఠశాల కరస్పాండెంట్ సామల బాల్ రాజు అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశానికి ఆయన సేవలు మరువలేనివని అందుకే ప్రపంచ విద్యార్థి దినోత్సవం జరుపుకుంటున్నామని గుర్తుచేశారు .కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ జార్జ్ జోసెఫ్ ,వైస్ ప్రిన్సిపాల్ రామ్ పెరుమాండ్ల , ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

## పంట నష్టపరహారం ఇవ్వండి ఓ రైతు ఆవేదన

వీపనగండ్ల, అక్టోబర్ 16 (జనం సాక్షి )

వీపనగండ్ల మండల పరిధిలోని గోవర్ధనగిరి గ్రామానికి చెందిన బొలమోని బొజ్జన్న అనే రైతు యాసంగి కాలంలో వరి పండించారు. పొలంలో అగ్గి తెగులు సోకడంతో వరి పంట పూర్తిగా నష్టపోవడం జరిగింది. రైతు తన ఆవేదనను చెబుతూ రెండు ఎకరాలలో 1264 సన్న రకం విత్తనం వేశానని కానీ అగ్గి తెగులు సోకడంతో వరి పంట మొత్తం బూడిద అయిందని తన ఆవేదనను తెలిపారు. ప్రభుత్వం నష్టపరిహారం ఇచ్చి నన్ను నా కుటుంబాన్ని ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## ఎమ్మెల్యే, కలెక్టర్ కు వినతిపత్రం

గట్టు, అక్టోబర్ 15 (జనం సాక్షి)బీ జోగులాంబ గద్వాల్ జిల్లా ధరూర్ మండల కేంద్రంలోని ర్యాలంపాడు ఆర్ అండ్ ఆర్ సెంటర్ లో జరిగిన కార్యక్రమానికి చిన్నోన్నినిపల్లి గ్రామస్తులు హాజరై కలెక్టర్, ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి గారికి వినతిపత్రం అందజేశారు .గట్టు మండలం చిన్నోనిపల్లి ఆర్ అండ్ ఆర్ సెంటర్ పునరావాస కేంద్రంలోని సదుపాయాలు కల్పించే అంశమై జిల్లా కలెక్టర్ బి.యం సంతోష్,గద్వాల్ శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి తో కలిసి గ్రామస్తులు, అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పునరావాస కేంద్రంలో పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించిన కలెక్టర్ బి.యం. సంతోష్ ప్రభుత్వం అన్ని సదుపాయాలు అందిస్తోంది .ప్రజలు ఇక్కడే ఇళ్లు నిర్మించి సంతోషంగా జీవించాలి అని తెలియజేశారు.రోడ్లు, నీరు, విద్యుత్, డ్రైనేజీ పూడిక ఆరోగ్య కేంద్రాలు, దేవాలయాలు, పాఠశాల నిర్మాణాలు,అంగన్వాడి విమానాలు అన్ని సదుపాయాలు త్వరలో సదుపాయాలు కల్పించే విధంగా కలెక్టర్ మళ్ళీ ఒకరోజు చిన్నోనిపల్లి ఆర్ అండ్ ఆర్ సెంటర్లో మీటింగ్ ఏర్పాటు చేసి వారికి కావాల్సిన అన్ని వసతులు అడిగి చర్చిస్తామని అన్నారు. బాధితులకు ఇప్పటికే కేటాయింపు షిఫ్టింగ్ చార్జీలు, ఇందిరమ్మ ఇళ్ల నిధులు త్వరలో ఖాతాల్లో జమకాబడును తెలిపారు. ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి మాట్లాడుతూ చిన్నోనిపల్లి ముంపు గ్రామ రైతులు, రైతులు త్యాగం చరిత్రలో చిరస్థాయిగా నిలుస్తుంది రైతుల త్యాగంతో గద్వాల్ పుష్కలంగా అభివృద్ధి చెందుతోంది తెలిపారు. ప్రజలకు ఎమ్మెల్యే, కలెక్టర్ ప్రజలకు వెంటనే పరిష్కారం చేపడతాం అని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో గట్టు మాజీ ఎంపీపీ జె విజయ్ కుమార్, చిన్నోనిపల్లి ఆర్ అండ్ ఆర్ సెంటర్ గ్రామస్తులు, శ్రీనివాసులు దాసరి బజారి, కురువ నర్సింలు వాగుబాయి వీరన్న, రామచంద్ర గౌడ్, తిమ్మారెడ్డి, వడ్డే రామాంజనేయులు, కురువ నర్సింలు, రంగన్న, వీరన్న, విరుపాక్షి, బడే సబ్, శివరాముడు వినతిపత్రం అందజేశారు.పరశురాం, అశోక్,వాలంటీర్ దానయ్య మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు సరళమైన పద్ధతిలో బోధించాలి : ఎంఈఓ

వీపనగండ్ల అక్టోబర్ 16( జనం సాక్షి)

వీపనగండ్ల మండలంలోని ఎంపీపీఎస్ కొర్లకుంట,ఎంపీపీఎస్ బొల్లారం, ఎంపీపీస్ గాంధీనగర్ బొల్లారం, జిల్లా పరిషత్ ఉన్నత బొల్లారం పాఠశాలలను మండల విద్యాధికారి నరసింహ సందర్శించడం జరిగింది. జెడ్‌పిహెచ్ బొల్లారం పాఠశాలల్లో పదవ తరగతి విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించి ఏ సబ్జెక్టులో అయితే వెనకబడి ఉన్నారో ఆ సబ్జెక్టు పైన ప్రత్యేక దృష్టి పెట్టి కృషి చేయాలని అన్నారు. ఉపాధ్యాయులకు తగు సూచనలను చేయడం జరిగింది, ఎంపీపీస్ బొల్లారం, ఎంపీపీఎస్ గాంధీనగర్ బొల్లారం, కొర్లకుంట ఎంపీపీఎస్ పాఠశాలను సందర్శించి పాఠశాలలో ఎఫ్ఎల్ఎన్ కి సంబంధించి తెలుగు, ఆంగ్లం, గణితం లో విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. అధేవిధంగా విద్యార్థుల యొక్క నిర్మాణాత్మక మూల్యకానం-1 నిర్మాణాత్మక మూల్యకానం-2 కి సంభందించిన ప్రశ్నపత్రాలు పరిశీలించటం జరిగింది. వెంకబడ విద్యార్థుల పై ప్రతీక శ్రద్ధ పెట్టాలని అన్నారు. పఠశాలలలో విద్యార్థులను సమ్మటివ్ -1( సంగ్రనాత్మక మూల్యకనం-1) కి సన్నాధం చేయలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిఆర్‌పి నాగరాజు వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు రాధిక, విష్ణు వనిత, పరుశరాముడు, బాలస్వామి, భగవంత్, రాధ, పాల్గొన్నారు.

## కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టిన బిజెపి రాష్ట్ర నాయకులు

అమరచింత ఆత్మకూర్ జనం సాక్షి అక్టోబర్ 15 మండల కేంద్రంలో ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ ఏర్పాటుచేసిన రాష్ట్ర బిజెపి కార్యవర్గ సభ్యులు బంగ్లా లక్ష్మి కాంత్ రెడ్డి విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలుపరస్తానని వట్టి మాటలుచెప్పి అధికారంలోకి వచ్చిందని అమలుపరస్తానని చెప్పిఆయన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజలకు సంక్షేమ పథకాలను చూయించి అధికారంలోకి రాగానే వాటిని మరిచిపోయారన్నారు. వారితోపాటు బిజెపి నాయకులు మండల అధ్యక్షుడు లావణ్య అంజి కామ భాస్కర్ అమరచింత మండల అధ్యక్షుడు వెంకటేశ్వర రెడ్డి భీమిరెడ్డి నల్లారెడ్డి ఆనందు వెంకటేశ్వర్లు రెడ్డి మస్తీపురము మణి వర్ధన్ రెడ్డి తో పాటు బిజెపి నాయకులు పాల్గొన్నారు.

## మాయ మాటలతో.. నగలు అపహరించి

పాపన్నపేట, అక్టోబర్ 15 (జనంసాక్షి) : భార్యాభర్తలకు మాయ మాటలు చెప్పి దుండగులు బంగారు నగలు అపహరించిన సంఘటన బుధవారం మెదక్ జిల్లా పాపన్నపేట మండలంలో కలకలం రేపింది. పాపన్నపేట ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ తెలిపిన వివరాలు .. నాగ్సాన్ పల్లి గ్రామానికి చెందిన భూసనేల్లి కిషన్ అతడి భార్య మణెమ్మ ఇరువురు కలిసి తమ బంధువుల వద్దకు ఒక విందుకోసం టేక్మాల్ మండల పరిధి లోని ఎల్లుపేట గ్రామానికి స్కూటీపై బయలుదేరారు. కొత్తపల్లి వంతెన వద్దకు రాగానే ఎదురుగా ద్విచక్ర వాహనం పై వచ్చిన ఇరువురు దుండగులు ఆపి మేము అధికారులమని,ఇంత బంగారు నగలు పెట్టుకొని తిరగడం మంచిది కాదని వారికి నచ్చజెప్పారు. వాటిని తీసి ముల్లె కట్టి డిక్కీలో వేసుకోమని చెప్పడంతో మాణేమ్మ తమ మెడలో ఉన్న నాలుగు తులాల పుస్తెల తాడు,తులంన్నర బంగారు గుండ్లను (పుస్తెలు) కర్చిప్ లో కట్టి డిక్కీలో వేశారు. ఇదే అదనుగా భావించిన దుండగులు వారిని మైమరిపించి ఆ నగలను తస్కరించి పారిపోయారు. కొద్ది దూరం వారు వెళ్లిపోయాక బాధితులు డిక్కిలో చూసుకొని లబోదిబోమన్నారు. ఆవేదనతో బాధితులు పాపన్నపేట ఠాణా చేరుకొని ఫిర్యాదు చేశారు. ఈ చోరీ ఘటన పై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు .

## అంటువ్యాధులపై ఆట పాట అవగాహన కల్పింన కళాకారులు

మల్దకల్ అక్టోబర్ 15 (జనంసాక్షి)మండలంలోని బిజ్వారం గ్రామంలో బుధవారం అంగన్వాడి సెంటర్ వద్ద జిల్లా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా డిపిఆర్ఓ సారథ్యంలో జిల్లా సాంస్కృతిక సారథి కళాకారులు తమ ఆటపాటల ద్వారా ప్రస్తుతం వర్షాకాలం నేపథ్యంలో మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ అంటు వ్యాధులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అదేవిధంగా ప్రజలు మూఢనమ్మకాల బారిన పడకుండా మోసపోవద్దని సూచించారు. చదువు ద్వారానే ఈ సమాజం మారుతుందని కాబట్టి ప్రతి ఒక్కరు తన పిల్లలను చదివించాలని అక్షరాస్యతకు నాంది పలకాలని కోరారు. అంగన్వాడీ టీచర్లు లక్ష్మీదేవి, పార్వతమ్మ, అనంతమ్మ,గ్రామస్థులు సమరసింహారెడ్డి,జె.గంగయ్య, అంగన్వాడి సెంటర్ చిన్నారులు పాల్గొన్నారు.

## పందుల దొడ్డిలా మారిన అంగన్వాడి సెంటర్లు

మల్దకల్అక్టోబర్ 15 (జనంసాక్షి)మల్దకల్ మండలం లోని బిజ్వారం గ్రామంలో అంగన్వాడీ కేంద్రాలు పందుల దొడ్డిలా మారాయి.చిన్నారులు అంగన్వాడి సెంటర్ లకు వెళ్లాలంటేనే పందుల భయంతో వణికిపోతున్నారు. చిన్నారులు భోజనం చేసే సమయంలో పందులు స్వైర విహారం చేయడం వల్ల చిన్నారులకు అంటూ వ్యాధులు మెదడు వాపు,మలేరియా,టైఫాయిడ్ జ్వరాలు వచ్చే అవకాశం ఉందని ఈ విషయంపై పందుల కాపరులకు చాలాసార్లు చెప్పిన కానీ పెడచెవిన పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు చిన్నారుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని పందుల కాపరులను హెచ్చరించి,సెంటర్ దగ్గరకు రానివ్వకుండా గట్టిగా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## చదువు అజ్ఞానాన్ని తొలగిస్తుంది : డిసిపిఓ



వీపనగండ్ల, అక్టోబర్ 16 (జనం సాక్షి) : మహిళ శిశు వికలాంగుల, వయో వృద్ధుల సంక్షేమ శాఖ వనపర్తి, జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో వీపనగండ్ల మండలం,తూముకుంట గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామ స్థాయి బాలల పరిరక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు.ఈ సంద ర్భంగా జిల్లా బాలల పరిరక్షణ విభాగం నుండి డిసిపిఓ ఎం.రాంబాబు బాల్య వివాహాల నిషేధ చట్టం-2006 గురించి మాట్లాడుతూ బాల్యవివహాలు నిర్మూ లించాలంటే గ్రామస్థాయి బాలల పరిరక్షణ కమిటీలు చాలా కీలకం అన్నారు. గ్రామంలో ఉన్న బాలల వయస్సు వారిగా జాబితా తయారు చేసుకుని 15 నుండి 18 సంవత్సరాలు వయస్సు ఉన్న బాలలపైన ప్రత్యేక దృష్టి పెట్టాలి అని తెలిపారు. బాల బాలికలు స్కూల్ డ్రాపౌట్ కావడం వలన కచ్చితంగా బాల్యవివాహలు జరిగే అవకాశం ఉంటుంది అన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల చదువు ఆపకుండ చదువుకునేలా చెయ్యడం వలన బాల్యవివహాలు అరికట్టవచ్చును అని అన్నారు.జిల్లా బాలల పరిరక్షణ విభాగం అందిస్తున్న సర్వీ సులు, బాలలపై లైంగిక వేధింపుల నిరోధ చట్టం 2012, బాల కార్మికులు, స్కూల్ డ్రాపౌట్,ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టం-2009, తల్లిదండ్రులు కోల్పోయిన బాల బాలికలకు స్పాన్సర్షిప్ పథకం ద్వారా ఆర్థిక సహా యం అందిస్తున్న విధానం వివరించారు. అత్యవసర సమయంలో బాలల కు ఎలాంటి సమస్య ఉన్న సంప్రదించాల్సిన చైల్డ్ హెల్ప్ లైన్ టోల్ ఫ్రీ నెంబర్ 1098,112,100 కాల్ చేసి తెలుపగలరని వివరించడం జరి గింది. అలాగే ప్రతిజ్ఞ చేసి బాల్యవివాహాల వలన జరిగిన నష్టం గురించి గోడ పత్రికను ఆవిష్కరించారు.ఐసిడిఎస్ సూపర్వైజర్ బీ.లక్ష్మి నారాయ నమ్మ, జిల్లా బాలల పరిరక్షణ విభాగం నుండి ఎం.నరేందర్ సోషల్ వర్కర్ గ్రామపంచాయితీ కార్యదర్శి ఎండీ.వహిద్,పాఠశాల ఉపాద్యాయులు కిరణ్ కుమార్, శివరాములు,అంగన్వాడీ ఉపాధ్యాయులు మాధవి, జి.లక్ష్మీ, ఏ.పారిజాత,ఆశ కార్యకర్తలు కుమారి ఆర్.కవిత, రాజేశ్వరి, సుజాత,రాణి, పద్మ, మహిళా సంఘం సభ్యులు,గ్రామ పెద్దలు మరియు కిశోరబాలికలు పాల్గొన్నారు.